తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
ఆదివారం
20 సెప్టెంబర్ 2026
పేజీలు : 8



Follow :

## వరి సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

- సాంప్రదాయ సాగు పద్ధతుల నుంచి ఆధునిక విధానాల వైపు రైతులు మారాలి
- విజయవంతమైన రైతుల అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవాలి
- ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- 'వరి వరహాలు' కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్




**పెద్దపల్లి,సెప్టెంబర్ 19(జనంసాక్షి) :** వరి సాగులో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని,తద్వారా అధిక దిగుబడులు సాధించేలా రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.శనివారం పెద్దపల్లి రంగంపల్లిలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వరి వరహాలు' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా( సా అండ్ రీప్ ఎన్ జీ ఓ)లి సంస్థ ఆధ్వర్యంలో వరి సాగులో నీటిని సమర్థవంతంగా వినియోగించిన రైతులకు ఎకరాకు రూ. 500 చొప్పున ప్రోత్సాహక చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగంలో శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఎంతో ముఖ్యమని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. అదే పాత పంటలు, పాత సాగు విధానాలను కొనసాగించడం ద్వారా ఆశించిన ఫలితాలు సాధించలేమని, ఆధునిక సాంకేతికతను వినియోగించి తక్కువ వనరులతో అధిక దిగుబడులు సాధించాల్సిన అవసరం ఉందని తెలిపారు.అధిక పరిమాణంలో ఉత్పత్తితో పాటు అత్యుత్తమ నాణ్యతను సాధించి ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడే స్థాయికి మన వ్యవసాయ ఉత్పత్తులు చేరుకోవాలని అన్నారు.ఇందుకోసం శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నీటి సమర్థ వినియోగం వంటి అంశాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కరీంనగర్ ప్రాంతంలో సుమారు 60 వేల ఎకరాల్లో రైతులను సాంప్రదాయ వరి సాగు విధానాల నుంచి ఆధునిక సాంకేతిక పద్ధతుల వైపు మళ్లించడంలో( సా అండ్ రీప్ ఎన్ జీ ఓ)సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులను ఎన్నో సంవత్సరాలుగా అనుసరిస్తున్న పాత సాగు పద్ధతుల నుంచి కొత్త విధానాలకు మళ్లించడం అంత సులభమైన విషయం కాదని, ఈ స్థాయిలో మార్పు తీసుకురావడం గొప్ప విజయమని తెలిపారు.వరి సాగులో నీటిని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా నీటి వృథాను అరికట్టడంతో పాటు పంటకు అవసరమైన సమయంలో తగిన మోతాదులో నీటిని అందించి మెరుగైన దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి రైతు నీటి సమర్థ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శాస్త్రీయ సాగు విధానాలను పాటించడం ద్వారా పంట దిగుబడులను పెంచడంతో పాటు చీడపీడల సమస్యలను కూడా నియంత్రించవచ్చని తెలిపారు.ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి విజయవంతమైన రైతులు తమ అనుభవాలను చుట్టుపక్కల రైతులతో పంచుకోవాలని కోరారు. ఒక రైతు సాధించిన విజయం మరెందరో రైతులకు స్ఫూర్తిగా నిలవాలని,విజయవంతమైన సాగు విధానాలను విస్తృతంగా ప్రచారం చేసి ఇతర రైతులు కూడా వాటిని అనుసరించేలా చూడాలని సూచించారు.రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులపై మరింత అవగాహన కల్పిస్తూ, నీటి పొదుపు, శాస్త్రీయ సాగు,అధిక దిగుబడులు,నాణ్యమైన ఉత్పత్తుల సాధన దిశగా వ్యవసాయ శాఖ, సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, ఎన్జీవో ప్రతినిధులు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**జగిత్యాల బ్యూరో సెప్టెంబర్ 19 (జనంసాక్షి)** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జగిత్యాల జిల్లాలోని రాయికల్ గ్రామం, మండలంలోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.2026 సంవత్సరానికి "డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్‌రూపకల్పన" అనే థీమ్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈ నెల 09న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాయికల్‌లోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం) లో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## రోబోటిక్స్ వైపు విద్యార్థుల అడుగులు

**సిరికొండ ఆదర్శ పాఠశాలలో సోహం అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్‌షాప్.. 24 మందితో రోబోటిక్స్ క్లబ్**



**సిరికొండ,సెప్టెంబర్19(జనంసాక్షి ):** విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు సృజనాత్మక ఆలోచనలు, సమస్య పరిష్కార నైపుణ్యాలను వెలికితీసే లక్ష్యంతో సిరికొండ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో సోహం అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. శనివారం 8వ, 9వ తరగతులకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో మొత్తం 106 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు రోబోటిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకం గా ఎలా ఉపయోగించు కోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రాక్టికల్ కార్యకలాపాల ద్వారా రోబోటిక్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే విధంగా శిక్షణ అందించారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్తులో రోబోటిక్స్‌కు ఉన్న అవకాశాలపై కూడా విద్యార్థులకు వివరించారు. వర్క్‌షాప్‌లో విద్యార్థుల ప్రతిభ, ఆసక్తిని పరిశీలించిన అనంతరం 24 మంది విద్యార్థులను రోబోటిక్స్ క్లబ్‌కు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. రోబోటిక్స్ క్లబ్‌కు 9వ తరగతికి చెందిన శ్రీ ఆదిత్య కెప్టెన్‌గా, 8వ తరగతికి చెందిన హర్ష వర్ధన్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ సౌమిత్రి, లావణ్య మేడం, సోహం అకాడమీ టీం హెడ్ వినయ్ రెడ్డి, సోహం అకాడమీ బృంద సభ్యు లు పాల్గొన్నారు. విద్యార్థులకు రోబోటిక్స్‌కు సంబంధించిన వివిధ అంశాలను వివరించి, ప్రాక్టికల్ కార్యకలాపాల ద్వారా శిక్షణ అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యా ర్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు వారి ప్రతిభ ను గుర్తించి ప్రోత్సహిం చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ కరంగా ఉంటాయని తెలిపారు. రోబోటిక్స్ వంటి ఆధు నిక సాంకేతిక అంశాలపై విద్యార్థు లకు చిన్న వయస్సు నుంచే అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో వారు సాంకేతిక రంగంలో తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపు ణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించేలా ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించిన సోహం అకాడమీ యాజమాన్యానికి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సింగరేణి కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- 76 జీఓ అమలు చేసి కార్మికులకు పట్టాలు ఇవ్వాలి..
- రామగుండంలో 1.800 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మించాలి..
- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్..



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ కోరారు.తెలంగాణ అసెంబ్లీలో సింగరేణి కార్మికుల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్,. 76 జీఓను అమలు చేసి సింగరేణి కార్మికులకు పట్టాలు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా సింగరేణి మారు పేర్ల సమస్యపై కమిటీ ఏర్పాటు చేసి, అర్హులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నందుకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సింగరేణి పరిధిలో సుమారు 50 వేల క్వార్టర్లు ఉన్నాయని, వాటిలో సుమారు 28 వేల క్వార్టర్లలో కార్మికులు నివసిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అనేక సింగరేణి క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారుతున్నాయని, వార్తా లోపలి పేజీలో

## ఘనంగా బలరామ జయంతి వేడుకలు



**సదాశివనగర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో బలరామ జయంతిని పురస్కరించుకొని భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరిశీచారు.అనంతరం వ్యవసాయ రంగానికి విశేష సేవలందిస్తున్న ఉత్తమ రైతులను, విద్యారంగంలో సేవలందిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రైతులు, ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ వారి కృషి సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో భారత్ కిసాన్ సంఘ్ నాయకులు, రైతులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐడీఓసీలో వినాయకునికి ప్రత్యేక పూజలు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనం సాక్షి:** వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణం(కలెక్టరేట్)లో ప్రతిష్టించిన వినాయకుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు గణనాథుడిని దర్శించుకుని అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు. ట్రేసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి అన్న ప్రసాద వితరణ గావించగా, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ సహకారం అందించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రశాంత్, భాస్కర్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గన్నారం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణ



**ఇందల్వాయి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనం సాక్షి:** మండలంలోని గన్నారం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సర్పంచ్ సుజాత శ్రీనివాస్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆదేశాల మేరకు ఈరోజు గన్నారం గ్రామంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ అండ్ చెక్కుల పంపిణీ చేశారు ఇటువంటి సేవా దృక్పథం ఉన్న ఎమ్మెల్యే మాకు దొరకడం ఎంతో గర్వకారణం అని సుజాత శ్రీనివాస్ అన్నారు ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఇటువంటి సేవా కార్యక్రమాలను చేయాలని గన్నారం గ్రామం తరపున మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను గ్రామ శాఖ అధ్యక్షులు బద్దం రెడ్డి బైరయ్య గుండ సుదర్శన్ వార్డ్ మెంబర్ సాయిలు గోపి సొసైటీ డైరెక్టర్ తాళ్లరాజు పాల్గొన్నారు

# తల్లిదండ్రుల సమావేశంతో విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం




సదాశివనగర్, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) తెలంగాణ ఆదర్శ పాఠశాల సదాశివనగర్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. గత నెలలో తల్లిదండ్రులు ఇచ్చిన హామీల అమలుపై సమీక్షించి, ఈ నెలలో పిల్లల అభ్యసనలో తల్లిదండ్రులు మరింత భాగస్వామ్యం కావాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలో జరిగిన విషయాలను ఇంటి వద్ద కూడా ఆంగ్లంలో మాట్లాడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు.ఆంగ్ల భాషలో ప్రతిభ కనబరిచే విద్యార్థులతో డ్రామా, కన్వర్జేషన్‌తో పాటు పండుగ అంశంపై మాట్లాడించారు. ఆయా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, నైపుణ్యాలపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు.నో బ్యాగ్ డే సందర్భంగా బ్యాంకు సందర్శన నో బ్యాగ్ డేలో భాగంగా విద్యార్థులు సదాశివనగర్‌లోని యూనియన్ బ్యాంకును సందర్శించారు. బ్యాంకులో రోజువారీ నిర్వహించే కార్యకలాపాలను విద్యార్థులకు సిబ్బంది వివరించారు. డిపాజిట్, విత్‌డ్రాయల్ వంటి లావాదేవీలకు సంబంధించిన వోచర్లు, రుణాల మంజూరు ప్రక్రియ తదితర అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు .మధ్యాహ్నం పాఠశాలలో విద్యార్థుల కోసం వివిధ కార్యకలాపాలు నిర్వహించగా, పీఎం శ్రీ కార్యక్రమం ద్వారా వివిధ అంశాల్లో విద్యార్థులు సాధించిన నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిం చారు. ప్రతి తల్లిదండ్రి సమావేశాలకు తప్పనిసరిగా హాజరై తమ పిల్లల విద్యా ప్రగతితో పాటు వారిలోని నైపుణ్యాలను తెలుసుకోవాలని పాఠశాల ఉపాధ్యా యులు సూచించారు.

# హామీల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం




**సిరికొండ, సెప్టెంబర్ 19 (జనం సాక్షి ):**ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ ఆరోపించారు. శనివారం సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని విస్మరించడం పాలకవర్గ పార్టీలకు అలవాటుగా మారిందని రామకృష్ణ విమర్శించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, మహిళలు, కార్మికులు, నిరుద్యోగులకు ఇచ్చిన పలు హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన ఆరోపించారు.రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఉన్న ఉద్యోగాలపై కూడా ప్రభావం చూపే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలపై వివిధ రకాల పన్నుల భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. యూపీఐ లావాదేవీలకు సంబంధించిన చార్జీల అంశం కూడా ప్రజలకు సమస్యగా మారుతోందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక వాగ్దానాలు చేసిందని, వాటిలో కొన్ని పూర్తిస్థాయిలో అమలు కాలేదని రామకృష్ణ ఆరోపించారు. మహిళలకు సంబంధించిన గృహలక్ష్మి పథకం, రుణమాఫీ వంటి హామీల అమలులో లోపాలు ఉన్నాయని, రైతులకు బోనస్ విషయంలోనూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు.రాజకీయ శిక్షణతో ప్రజా ఉద్యమాల నిర్మాణం ఇటీవల నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో పార్టీ సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు రామకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని, బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్. దామోదర్, బి. బాబన్న, బి. కిశోర్, మండల నాయకులు ఎం. లింబాద్రి, ఎస్. కిషోర్, ఎం. అనీష్, ఎల్. ఆశీస్, జే. రాజు తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజులుగా మురుగునీటిలో ప్రజల అవస్థలు



**నిజామాబాదు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనం సాక్షి:**పట్టణంలోని ప్రధాన రహదారి ఇది. నిత్యం వేలాది మంది ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగించే రద్దీ ప్రాంతం. కానీ, గత మూడు రోజులుగా ఇక్కడి పరిస్థితి చూస్తే, ఇది ఒక అభివృద్ధి చెందుతున్న పట్టణంలోని రోడ్డులా కాకుండా, ఒక నరక కూపంలా కనిపిస్తోంది. కొసంత వర్షాలు పడగానే రోడ్డుపై చేరిన మురుగునీరు నిలిచిపోయి, మురుగు కుంటగా మారిపోయింది.మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, పారిశుధ్య నిర్వహణలో వైఫల్యం వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.దుర్వాసన రోగాల భయం రోడ్డుకు ఇరువైపులా, ముఖ్యంగా ఎడమ వైపున నిలిచిన మురుగునీరు, బురద రోడ్డు అంతటా వ్యాపించింది. దీంతో తీవ్రమైన దుర్వాసన వెలువడుతోంది. వాహనదారులు, పాదచారులు ఈ మురుగు గుండా వెళ్లేటప్పుడు తమ ముక్కులు మూసుకోవడం తప్పనిసరి అవుతోంది. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ఈ దుర్వాసనను భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వల్ల పేరుకుపోయిన ఈ మురుగునీటిలో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో స్థానికులలో డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.రోడ్డు గుంతలమయమై, బురదగా మారడం వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. స్థానికులు, వ్యాపారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోక పోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది పాడైన రోడ్డును వెంటనే మరమ్మతు చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయాలి. పారిశుధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి.పట్టణ అభివృద్ధి అనేది కేవలం కాంక్రీట్ భవనాల నిర్మాణం కాదు, ప్రజలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం కూడా. మున్సిపాలిటీ అధికారులు తమ బాధ్యతను విస్మరిస్తే, రాబోయే కాలంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరిస్తారని ఆశిద్దాం.

# తెలంగాణ యూనివర్సిటీలో పాముకాటు పై అవగాహన సదస్సు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనం సాక్షి:** తెలంగాణ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (చీరా) యూనిట్--×× ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్. అబ్దుల్ హలీం ఖాన్ ఆధ్వర్యంలో అంత ర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవం సందర్భంగా పాముకాటు నివారణ, ప్రథమ చికిత్స, సకాలంలో వైద్యం పొందడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. హలీం ఖాన్ మాట్లాడుతూ పాముకాటు ఒక్క వైద్యం మాత్రమే అత్యవసర పరిస్థితి అని, పాముకాటుకు గురైన వ్యక్తిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలని ఆయన సూచించారు .బాధితుడిని ప్రశాంతంగా ఉంచి, కదలికలను తగ్గించి, కాటుకు గురైన అవయవాన్ని స్థిరంగా ఉంచాలని తెలిపారు. ఉంగరాలు, గాజులు, గడియారాలు, బిగుతైన వస్తువులను వాపు రాకముందే తొలగించాలని ఆయన సూచించారు. పాము కాటేసినప్పుడు గాయం కోయడం, విషాన్ని నోటితో పీల్చడం, ఐస్ లేదా రసాయనాలు రాయడం, బిగుతైన టోర్నికెట్ కట్టడం, నాటు వైద్యం చేయించడం వంటి అపోహలకు దూరంగా ఉండాలని ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పామును పట్టుకోవడానికి లేదా చంపడానికి ప్రయత్నించకుండా, సురక్షితంగా ఉంటే దూరం నుంచి ఫొటో తీసుకోవచ్చని ఆయన తెలిపారు. శాస్త్రీయ అవగాహన, తక్షణ వైద్యం, సరైన ప్రథమ చికిత్సతో పాముకాటు వల్ల కలిగే ప్రాణనష్టం, వైకల్యాలను గణనీయంగా తగ్గించ వచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్,విద్యార్థులు పాల్గొన్నారు.

# రావుట్లలో ప్రజలతో బీజేపీ చాయ్ పే చర్చ



**సిరికొండ, సెప్టెంబర్ 19 (జనం సాక్షి ):** భారతీయ జనతా పార్టీ సిరికొండ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం రావుట్ల గ్రామంలో 'చాయ్ పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖుషి శైలేష్, పోతుగంటి మధు స్వగృహాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజా సమస్యలు, మౌలిక వసతుల కల్పన, గ్రామాభివృద్ధి, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలపై నాయకులు, గ్రామస్థులతో ఆత్మీయంగా చర్చిం చారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలు తెలుసు కోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడమే 'చాయ్ పే చర్చ' కార్యక్రమం ఉద్దేశమని నాయకు లు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, గ్రామస్థాయిలో వాటి అమలు తీరుపై చర్చించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి ప్రజలు చేసిన సూచనలు, వ్యక్తం చేసిన అభిప్రాయాలను సేకరించి సంబంధిత వేదికల ద్వారా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ప్రజల మాటను నేరుగా వినడం, స్థానిక సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కార మార్గాలపై చర్చించడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు బీజేపీ సిరికొండ మండల కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సూచనలు, అభిప్రాయాలను నిర్మొ హమాటంగా తెలియజేయాలని నాయకులు కోరారు. ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధి కారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడికి మాదిగ మహిళా సమాఖ్య పిలుపు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనం సాక్షి:** పోరాటాల పునాదులపైనే మాదిగల ఎదుగుదల ఆధారపడి ఉందని, మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పి) విజయం సాధించడమే మన తక్షణ లక్ష్యమని మాదిగ మహిళా సమాఖ్య జాతీయ అధ్యక్షురాలు నంబూరి తబిత మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మార్గదర్శకత్వంలో, ఆయన ఆశయాలకు అనుగుణంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ప్రత్యేక మహిళా సన్నాహక సమావేశం శనివారం నగరంలోని సందీప్ గార్డెన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. జిల్లాలో నూతన మహిళా సంఘాలు, మహాజన మహిళా సంఘాల నిర్మాణం మరియు అక్టోబర్ 2న తలపెట్టిన మద్యపాన నిషేధ నిరసన కార్యక్రమమే ప్రధాన అజెండాగా ఈ సమావేశం కొనసాగింది. సభ ప్రారంభం – ముఖ్య అతిథుల రాక రెండు రాష్ట్రాల జిల్లాల పర్యటన పూర్తి చేసుకుని నిజామాబాద్ జిల్లాకు విచ్చేసిన ఈ సమావేశానికి మాదిగ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటూ పద్మా మాదిగ సభాధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు నంబూరి తబిత మాదిగ, ఎంఎంఎస్ మహాజన మహిళా మండలి జాతీయ అధ్యక్షులు లతా మాదిగ, ఎంఎంఎస్ మాదిగ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీతా మాదిగ, జాతీయ అధికార ప్రతినిధులు మనేమ్మ, కరుణా మాదిగ, కోర్ కమిటీ సభ్యులు సత్యక్క, యమున తదితరులు హాజరయ్యారు. చారిత్రక పోరాటాలు – వర్గీకరణ సాధన ఎన్నో ఉద్యమాలు చేసి, జైలు జీవితాలు గడిపి, పోలీసుల లాఠీ దెబ్బలు తింటూ సుదీర్ఘ పోరాటాల ద్వారానే తాము ఈ స్థాయికి ఎదిగామని నాయకులు స్పష్టం చేశారు. అట్టడుగున ఉన్న మాదిగ జాతిని సమున్నతంగా నిలబెట్టేందుకు మంద కృష్ణ మాదిగ చేసిన త్యాగాలు మరువ లేనివని కొనియాడారు. పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఈ సన్నాహక సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఎంఎంఎస్, ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, పురుష కార్యకర్తలు మరియు యువకులు ఉత్సాహంగా పాలుప ంచుకున్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రెండు బలమైన కమిటీలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చురుగ్గా పనిచేస్తూ, అక్టోబర్ 2న తలపెట్టిన ఉద్యమాన్ని విజయవంతం చేయాలని వారు సంకల్పించారు. సమావేశం చివరిలో కార్యకర్తల ఉత్సాహపూరిత జై జై మందకృష్ణ మాదిగ" నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది

## తులసిరామ్ గౌడ్ ను సన్మానించిన మాజీ ఎంపీపీ



**కమాన్ పూర్, సెప్టెంబర్ 19, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొరకొప్పుల తులసి రామ్ గౌడ్ ను ఉమ్మడి కమాన్ పూర్ మండల మాజీ ఎంపీపీ కోలేటి మారుతి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తులసి రామ్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కోలేటి మారుతి.. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ఏక్ పెడ్ మా కే నామ్ పాఠశాలలో 1000 మొక్కలు నాటిన విద్యార్థులు



**కథలాపూర్ సెప్టెంబర్ 19 (జనం సాక్షి)**కథలాపూర్ మండలంలోని తండ్రియాల గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల లో నో బ్యాగ్ డే సందర్భంగా ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఏక్ పెడ్ మా కే నామ్" (అమ్మ పేరు మీద ఒక మొక్క నాటడం) అనే కార్యక్రమాన్ని తీసుకొని ప్రభుత్వ భూమిలో 1000 మొక్కలను నాటారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్,ఎం ఈ ఓ.లోకిని శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ జంగ శివాని రంజిత్ ఉప సర్పంచ్ అల్లూరి జనార్దన్ రెడ్డి వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు ధూమాల స్వామి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఎంపీడీఓ శంకర్ మాట్లాడుతూ మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, ప్రతి విద్యార్థి తన మొక్కను తల్లి పేరు మీద సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఎం ఈ ఓ.లోకిని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలుష్య నివారణకు మొక్కలు నాటడం ఎంతో అవసరమని,విద్యార్థి దశ నుండే పర్యావరణ స్పృహ పెరగాలని అన్నారు. సర్పంచ్ శివాని రంజిత్ ఉప సర్పంచ్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పర్యావరణ పరిరక్షణే తమ ప్రాథమిక లక్ష్యమని, నాటిన మొక్కల సంరక్షణను గ్రామ పంచాయతీ చూసుకుంటుందని తెలిపారు.

## మెడికల్ షాప్ లో సీ సీ కెమెరాలు తప్పనిసరి



**ముస్తాబాద్ సెప్టెంబర్ 19( జనం సాక్షి )**డాక్టర్ చిట్టి ఉంటే తప్ప అమ్మడానికి వీలుని ఔషధాల విక్రయాన్ని విక్రయించే దుకాణాలు ఉన్నాయి వ్యవస్థను బలోపేతం చేసేందుకు మండలంలో ప్రతి మెడికల్ షాప్ లో సీ సీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రతిపాదించింది. సవరించిన ఔషధ నియమాల్లో భాగంగా షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎక్స్ ఔషధాలను డాక్టర్ చిట్టి లేకుండా విక్రయించడాన్ని నిరోధించేందుకు ఈ ఈ చర్య అవసరమని ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రతిపాదలపై తోలుతో ఔషధ సంప్రదింపుల కమిటీ చర్చించింది. అనంతరం వాటిని ఔషధ సాంకేతిక సలహా బోర్డు పరిశీలనకు పంపి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని శాఖ పిలుపునిచ్చింది. మండలంలో బీనామి పేర్లమీద మెడికల్ షాప్ లైసెన్సు పొంది అర్హత లేని వ్యక్తులు నిర్వహిస్తున్నారు. మెడికల్ షాప్ ముందు మెడికల్ షాప్ వెనుక ఆర్ఎంపి వైద్యులు నిర్వాకం మండలంలో కొనసాగుతుంది. వాటిపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటించక నడుపుతున్న షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# ఆరు దాటితే భయం భయం



**గంభీరావుపేట, సెప్టెంబర్ 19 జనం సాక్షి;**రాజన్న సిరిసిల్ల జిల్లా-- ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతమైన గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజి వద్ద సాయంత్రం ఆరు గంటలు దాటితే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారని వాపోతున్నారు. ప్రధాన రహదారి వెంట సరైన లైటింగ్ సౌకర్యం లేకపోవడంతో చీకటి అలుముకుంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దమ్మ స్టేజి చుట్టూ అటవీ ప్రాంతం ఉండటంతో రాత్రివేళల్లో వన్యప్రాణులు, కోతుల సంచారం ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. అదేవిధంగా చీకటి కారణంగా దొంగతనాల భయం కూడా ఉందని పేర్కొంటున్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా అధికారులు స్పందించి పెద్దమ్మ స్టేజి వద్ద వెంటనే లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

# పోతిరెడ్డిపల్లి లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



**వీణవంక సెప్టెంబర్ 19(జనం సాక్షి)** వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి,మానేరు వాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి,మానేరు వాగు నుండి శనివారం రోజున ఉదయం అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా మార్గమధ్యంలోఅట్టి ట్రాక్టర్‌ను ఆపి ఇసుక తరలింపునకు ప్రభుత్వ అనుమతి పత్రాలు అడిగాగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా 5 ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో ఇట్టి ట్రాక్టర్లను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాటిపైన కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వీణవంక మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లయితే అట్టి ట్రాక్టర్ల యజమానులపై చట్టరీత్యా చర్య తీసుకుంటానని వారన్నారు. ఎవరైనా ఎంతటి వారైనా అక్రమంగా ఇసుక తరలిస్తే అట్టి ట్రాక్టర్ల సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతానని వారు తెలిపారు

# పరిశుభ్రమైన గ్రామం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**గన్నేరువరం, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):**గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛత హి సేవా -- 2026 కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ తెలిపారు .గ్రామంలో ప్రజలు తరచుగా చెత్త వేస్తున్న ప్రదేశాలను గుర్తించి, అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. భవిష్యత్తులో చెత్త పేరుకుపోకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీకి అందించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పి. రాజేష్, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# తెల్ల రేషన్ కార్డుదారుల మహిళలకు చీరల పంపిణీ

**యైటింక్లైన్ కాలనీ,(జనంసాక్షి) సెప్టెంబర్ 19:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం రామగుండం నియోజకవర్గం 17వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు ఇరికి రాజేశ్వరి చేతుల మీదుగా అర్హులైన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆత్మీయ భరోసా పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచేలా ఇందిరమ్మ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాగమణి, స్వప్న, మహేష్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు. మహిళా సాధికారత, సంక్షేమమే లక్ష్యంగా నిర్వహించిన ఈ చీరల పంపిణీ కార్యక్రమానికి స్థానికంగా మంచి స్పందన లభించింది.

# విద్యార్థులకు ఏకరూప దుస్తులు షూస్ పంపిణీ

**సిరికొండ, సెప్టెంబర్ 19 (జనం సాక్షి ):**సిరికొండ మండలం మెట్టుమర్రి తండా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కేతావత్ తిరుపతి నాయక్ విద్యార్థులకు పాఠశాలకు వచ్చిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతి నాయక్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పాఠ్యపుస్తకాలు, పాఠశాల దుస్తులను ఉచితంగా అందిస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యారంగంలో తెలంగాణను దేశంలోనే ముందంజలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్టుమర్రి తండా గ్రామపంచాయతీ పాలకవర్గం కూడా ప్రత్యేక చొరవ తీసుకుంది. సర్పంచ్ కేతావత్ తిరుపతి నాయక్, ఉపసర్పంచ్ గొప్యా నాయక్ తమ సొంత నిధులతో పాఠశాల



విద్యార్థులకు తెల్ల దుస్తులతో పాటు బ్లాక్ అండ్ వైట్ షూస్‌ను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠశాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ పాలకవర్గం తన వంతు సహకారం అందిస్తుందని వారు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ సహకరిస్తున్న ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డికి గ్రామ నాయకులు, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జిల్లా నాయకులు సంతోష్ నాయక్, ఉపసర్పంచ్ గొప్యా నాయక్, మాజీ సర్పంచ్ బాల్సింగ్, మాజీ ఉపసర్పంచ్ అజ్మీరా జగన్ నాయక్, పాఠశాల ఉపాధ్యాయురాలు సరోజ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాంజీ, వీఎడీసీ శంకర్, సంతోష్ పంతులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సమీక్ష సమావేశంలో విద్యుత్ సమస్యలపై సర్పంచుల ఆగ్రహం

**చిగురుమామిడి సెప్టెంబర్ 19(జనంసాక్షి):**మండల కేంద్రంలో నిర్వహించిన చిగురుమామిడి మండల స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశం ప్రజా ప్రతినిధుల నిలదీతలు,ఆవేదనల మధ్య సాగింది .ప్రజా సమస్యలు ప్రస్తావించినా అధికారు లు స్పందించకపోవడంపై సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాని ఇలాంటి సమావేశాలు ఎందుకు..? అంటూ అధికారులను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించాల్సిన సమావేశాలు రైతు వేదికలో నిర్వహించడంతో, అక్కడ సరైన ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతలో అధికారులు ప్రజాప్రతినిధులు గంటల పాటు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇదంతా తెలిసిన మండల పరిషత్ అధికారులు నిత్యం రైతు వేదిక లోనే సమావేశాలు ఏర్పాటు చేయడం ఏంటని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. సరైన వసతులు కల్పించకుండా ఇలా రైతు వేదికల ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా విద్యుత్ శాఖ తీరుపై సర్పంచులు మార్క రాజకుమార్ గౌడ్,కాటం సంపత్ రెడ్డి,జంగా శిరీష రెడ్డి,ఒంటెల కిషన్ రెడ్డి, గునుకుల మధుసూదన్ రెడ్డి,సాంబారి భారతమ్మ,సన్నీళ్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. అదేవిధంగా, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఉల్లంపల్లి సర్పంచ్ అలువాల




శంకర్ తీవ్రంగా నిలదీశారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వైద్యశాఖాధికారుల్లో చలనం లేదని రేకొండ సర్పంచ్ అల్లెపు సంపత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేకొండ గ్రామంలో ఎదురవుతున్న సమస్యలపై ఆ గ్రామ సర్పంచ్ ఆల్లెపు సంపత్ సమావేశంలో తన ఆవేదనను వెళ్లగక్కారు. రేకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం ఆసుపత్రి భవనం సైతం శిథిలావస్థకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రేకొండ గ్రామానికి సరైన రవాణా సౌకర్యం లేదని, తక్షణమే బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులు,ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం నిత్యం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు తెలిపిన సమస్యలను స్వతరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ చత్రు నాయక్,ఎంపీడీవో రామ్మోహన్ చారి, తహసిల్దార్ కనకయ్య, సింగిల్విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,పలు గ్రామాల సర్పంచులు అకవరం భవాని, చింతపూల నరేందర్, బోయిని రమేష్,పీచు సత్యనారాయణ రెడ్డి, గోగూరి లక్ష్మి,తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సి హెచ్ పిలో కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఐలి శ్రీనివాస్



**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి):** ఆర్జీ-2 తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ( టీబీజీకేఎస్) ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ సి హెచ్ పి ని సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.గత కొంతకాలంగా యాజమాన్యం అవసరమైన పని ముట్లు, మెటీరియల్‌ను సక్రమంగా అందించక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు తెలిపారు. అలాగే డ్రైయిన్ సౌకర్యం సరిగా లేకపోవడం, నీటి సమస్య కారణంగా నీరు లోపలికి రావడంతో ఉత్పత్తికి అంతరాయం కలుగుతోందని వివరించారు. సి హెచ్ పి లో దుమ్ము అధికంగా ఉండటంతో కార్మికులు పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.కార్మికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఐలి శ్రీనివాస్ కోరారు. అవసరమైన పనిముట్లు, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచడంతో పాటు నీటి సమస్య, దుమ్ము సమస్యలను పరిష్కరించి కార్మికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు ఐ. సత్యం, భేతి చంద్రయ్య, మార్కు నరేష్, బ్రాంచ్ సెక్రటరీ ముసుకుల అనిల్ రెడ్డి, పిట్ కార్యదర్శి శేఖర్, గుమ్మడి సుందర్, ముప్పిడి కుమార్, కె. సురేష్, కనకయ్య, రెంట్ల కుమార్, ధర్ముల శంకర్, వెంకన్న, పిట్టల రమేష్, రాకేష్, రాజేందర్, రాజశేఖర్, రమేష్, అనిల్, తదితర నాయకులు, పిట్ కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

# మాదిగలపై అరాచకాలను నిరసిస్తూ ఉద్యమం చేస్తాం




గోదావరిఖని, జనంసాక్షి:మాదిగ జాతిపై జరుగుతున్న దాడులు, అరాచకాలు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా అతి త్వరలోనే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని మాదిగ మహాశక్తి తెలంగాణ కోర్ కమిటీ సభ్యుడు ఆసంపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని తాండ్ర అక్షిత రాణి ఆత్మహత్యకు కారకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ... నిందితులను అరెస్టు చేయడంలో జరుగుతున్న జాప్యం పై మండిపడ్డారు. వేధింపుల మూలంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అక్షిత సూసైడ్ నోట్ కూడా రాసినప్పటికీ కారకులను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడంను ఎంతవరకు సమంజసం అన్నారు. అక్షిత మృతికి కారకులైన ప్రతి ఒక్కరిని అరెస్టు చేయాలన్నారు. దళిత జాతి బిడ్డ అక్షిత ఆత్మహత్య సంఘటనపై ఇప్పటివరకు పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు, రామగుండం శాసనసభ్యులు ఎవరు కూడా మాట్లాడకపోవడం అన్యాయం అన్నారు. అక్షిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తూ కోటి రూపాయల పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రామగుండం ఏరియాలోని సింగరేణి బొగ్గు గనులు పనిచేస్తున్న మహిళలపై వేధింపులు ఎక్కువవుతున్నాయని ఆరోపించారు. అక్షిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు మాదిగ మహాశక్తి ముందుండి పోరాటం చేస్తుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సంఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మాసంపల్లి శ్రీనివాస్ చెప్పారు. విలేకరుల సమావేశంలో మాదిగ మహాశక్తి ప్రతినిధులు స్వప్న, కుక్క కనకరాజు, ఆసంపల్లి రవీందర్, నాతరి ఆదిత్య, పోయిల సాగర్, కుక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# యువత మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగ చేసుకోవాలి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనం సాక్షి:**శనివారం జిల్లా కేంద్రంలో ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 -- జశీఎవ టశీతీ కార్యక్రమం టవర్స్ యందు ఉత్సాహభరితంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత, టెక్నాలజీ నిపుణులతో ముచ్చటిస్తూ వారు రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులు మరియు సమస్యల పరిష్కార విధానాలను పరిశీలించారు.ప్రస్తుత ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కీలకంగా మారుతోందని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వివిధ సామాజిక సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను అభివృద్ధి చేసే అవకాశం ఉందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.యువతలో ఉన్న సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సాంకేతిక నైపుణ్యాలను సరైన దిశలో వినియోగిస్తే సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు వంటి కార్యక్రమాలు యువతను సాంకేతిక రంగంలో మరింత ప్రోత్సహించడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు వేదికగా నిలుస్తాయని అన్నారు.పోలీసింగ్ వ్యవస్థలో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజా భద్రత, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, డేటా విశ్లేషణ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే దిశగా సాంకేతికతకు ప్రాధాన్యత పెరుగుతోందని పేర్కొన్నారు. యువత కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడమే కాకుండా, దానిని ప్రజా ప్రయోజనం, సమాజ శ్రేయస్సు మరియు దేశ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.యువత రోడ్డు భద్రత నియమావళిని తప్పనిసరిగా పాటించాలని 2025 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల వలన జిల్లా వ్యాప్తంగా 327 మంది మరణించారని అదే కోవిడ్ సమయంలో 200 మంది చనిపోయారని గుర్తు చేశారు. యువత అనుక్షణం సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా హ్యాకథాన్‌లో పాల్గొన్న యువత విద్యార్థులకు ప్రశంసా పత్రములు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో నజీబ్ (సి.ఈ.ఓ) షేక్ సబ్బార్ మేనేజర్ రజనీకాంత్ (కాకతీయ ప్రిన్సిపాల్ ప్రతినిధులు , నిర్వాహకులు , టెక్నాలజీ నిపుణులు , విద్యార్థులు మరియు యువత పాల్గొన్నారు.

# పరిశీలించాడు పరిష్కరించాడు



**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద గల డబుల్ బెడ్ రూమ్ కాలనీ సమస్యలతో సతమతమవుతుంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సీ సెల్ జుక్కల్ నియోజకవర్గ మాజీ చైర్మన్ సౌదాగర్ అరవింద్ శుక్రవారం రాత్రి కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ రాజశేఖర్ కు సమస్యను తెలిపారు. స్పందించిన తహశీల్దార్ రాజశేఖర్ వెంటనే ఇంటి నంబర్ కేటాయించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులకు ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి గీత ఇంటి నెంబర్ ను (ఆఫ్ లైన్ లో) కేటాయించారు. త్వరలో ఆన్లైన్ చేస్తామని తెలిపారు. త్వరగా విద్యుత్ సమస్యను కూడా పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# అకాల మరణించిన కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత



**గంభీరావుపేట, సెప్టెంబర్ 19 జనం సాక్షి:**రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన పావన్నగారి దేవయ్య గౌడ్ ఇటీవల అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న గౌడ సంఘం నాయకులు, యువకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షులు జోగి సురేష్, ఈసీ సభ్యులు మొగులాల రామచంద్రం గౌడ్ ఆధ్వర్యంలో దేవయ్య గౌడ్ కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా నిలుస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి టేకు మల్ల ప్రవీణ్, యువ నాయకులు దేశెట్టి రాజశేఖర్, అల్లెపు రమేష్, వెంకటస్వామి, దుబాసి నరసింహులు, సాయి, జోగు చందు, దేవదాస్, శీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



**కథలాపూర్, సెప్టెంబర్ 19(జనం సాక్షి )**కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామానికి చెందిన ఒగ్గు రమేష్, వయస్సు 42 సంవత్సరాలు తండ్రి. మల్లయ్య, రమేష్ తేదీ 14-09-2026 సోమవారం రోజున రాత్రి 8.00 గంటలకు పని ముగించుకుని తాండ్రియాల గ్రామం నుండి తన యొక్క టీ ఎస్ 23 బి 7078 స్కూటీపై ఇప్పపెల్లి లోని తన ఇంటికి వెళ్తుండగా, ఇప్పపెల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ గుడి సమీపంలో అతి వేగంగా వెళ్లి అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు ఎడమ ప్రక్కన తీవ్ర గాయమైంది. అనంతరం చికిత్స పొందుతూ రోడ్డు ప్రమాదంలో తలకి తీవ్ర గాయాలు కావడంతో తేదీ 19-09-2026 శనివారం రోజున ఉదయం హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుని బావమరిది చిట్యాల మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్సై రవికిరణ్ తెలిపారు.

## మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో మూడు అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

జమ్మికుంట,సెప్టెంబర్ 19 (జనం సాక్షి): జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి సమావేశ అజెండాలోని అంశాలను చదివి వినిపించాలని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అనంతరం మూడు అంశాలపై చర్చించి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), కమిషనర్ గుట్టల మల్లికార్జున్ మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ, చిన్న బతుకమ్మ, పెద్ద బతుకమ్మ వేడుకల నిర్వహణకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేపట్టేందుకు రూ.25 లక్షల పరిపాలనా, ఆర్థిక అనుమతి,గాంధీ జయంతి సందర్భంగా రంగులు వేయడం, పూల అలంకరణ తదితర కార్యక్రమాల కోసం సుమారు రూ.10,000 వ్యయానికి ఆమోదం,సానిటేషన్ విభాగం అవసరాల కోసం



బ్లీచింగ్ పౌడర్, మలాథియాన్ ఆయిల్,గడ్డి మందు కొనుగోలుకు సుమారు రూ.2,85,000 వ్యయానికి ఆమోదం,ఈ మూడు అంశాలను కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారన్నారు .అనంతరం కార్యాలయ సిబ్బంది కొలుగురి సురేష్,జూనియర్ అసిస్టెంట్ ఈనెల పదో తారీఖున మరణించగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఒక నిమిషం కౌన్సిల్ సభ్యులు మౌనం పాటించినారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మహ్మద్ ముంతాజ్ అలీ (జావిద్),మున్సిపల్ కౌన్సిలర్లు, మేనేజర్ జి.రాజిరెడ్డి, ఏఈ వికాస్,శానిటరీ,ఆర్ఐ ఎ.భాస్కర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ముస్తాబాద్ సెప్టెంబర్ 19 (జనం సాక్షి)ముస్తాబాద్ మండల కేంద్రంలోని పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పాలకవర్గ సభ్యులతోపాటు ప్రజా ప్రతినిధుల చేతులమీదుగా చైర్ పర్సన్ తలారి రాణి నర్సింలు, శంకుస్థాపన చేశారు శంకుస్థాపన చేశారు, మండలంలోని పోతుగల్ గ్రామంలోని పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గ్రామాలకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు మార్కెట్ కమిటీ నిధులు 28 లక్షల 50 వేల తో శంకుస్థాపన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తలారి రాణి నర్సింలు మాట్లాడుతూ రెండు సంవత్సరాల పదవీకాలంలో రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు అమ్మకాల విషయంలో అందుబాటులో ఉండి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసాం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాటుపడుతూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమని అన్నారు. రైతుల సహకారంతోనే మార్కెట్ కమిటీని మా వంతు సహకారాన్ని అందిస్తూ అన్ని రంగాల్లో ముందు



వరుసలో ఉండి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ జెడ్పిటిసి మెరుగు యాదగిరి గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గజ్జల రాజు, పోతుగల్ సర్పంచి పెద్ది గారి యాదమ్మ శ్రీనివాస్, ఆత్మ డైరెక్టర్ కొండల్ రెడ్డి, మోతే బాలరాజు, పోచమ్మల అనిత, చైర్మన్ రామ్ రెడ్డి,డైరెక్టర్లు అన్నమనేని సుధాకర్ రావు, క్యారం రాజు, మామిళ్ళ శ్రీకాంత్, ప్రతాప్ రెడ్డి, , కుంభాల యాదగిరి రెడ్డి, కదిరే సత్యం గౌడ్, మారుపాక శంకర్,

## సింగరేణి కార్మికుల సొంతింటి కలకు అడుగులు

గోదావరిఖని, జనంసాక్షి:సింగరేణి కార్మికుల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేసేందుకు యాజమాన్యం సానుకూలంగా ఉందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి తెలిపారు. కార్మికులకు సొంతింటి సౌకర్యం కల్పించే అంశంపై ఇప్పటికే సింగరేణి ఉన్నతాధికారులతో చర్చలు జరిపామని, ఈ దిశగా మరింత ముందుకు వెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు.గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూ స్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వంలోని సంబంధిత పెద్దలను కలిసి సింగరేణి కార్మికుల సొంతింటి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లేందుకు సీఐటీయూ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, యాజమాన్యం నుంచి సానుకూల నిర్ణయం వచ్చేలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.యాజమాన్యానికి ప్రయోజనమే .సింగరేణి కార్మికులకు సొంతింటి సౌకర్యం కల్పించ డం వల్ల కార్మికులకే కాకుండా యాజమాన్యా నికి




కూడా ప్రయోజనం చేకూరుతుందని రాజారెడ్డి వివరించారు. యాజమాన్యమే పెద్దఎత్తున ఇళ్లను నిర్మించి కార్మికులకు అందించాల్సి వస్తే భారీ మొత్తంలో వ్యయం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు .అదే సమయంలో కార్మికులు తమకు కేటాయించిన స్థలాల్లో సొంతంగా ఇళ్లు నిర్మించుకునే విధంగా యాజమాన్యం, ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తే ఆర్థిక భారం తగ్గడంతో పాటు కార్మికులకు శాశ్వతంగా సొంత గూడు సమకూరు తుందని అన్నారు.అన్ని సంఘాలు కలిసి ముందుకు రావాలి..సింగరేణి కార్మికుల సొంతింటి సమస్య ఏ ఒక్క కార్మిక సంఘానికో సంబంధించిన అంశం కాదని, వేలాది మంది కార్మిక కుటుంబాల భవిష్యత్తు తో ముడిపడి ఉన్న సమస్య అని తుమ్మల రాజారెడ్డి అన్నారు. అందువల్ల రాజకీయాలకు, సం ఘాల మధ్య భేదాభిప్రాయాలకు అతీతంగా అన్ని కార్మిక సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఈ సమస్య పరిష్కా రానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు .సింగరేణి కార్మికుల చిరకాల ఆకాంక్ష అయిన సొంతింటి కల సాకారమైతే వేలాది కార్మిక కుటు ంబాలకు భరోసా లభిస్తుందని, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతాయని ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సిఐటి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### తులసిరామ్ గౌడ్ ను సన్మానించిన మాజీ ఎంపీపీ



కమాన్ పూర్, సెప్టెంబర్ 19, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొరకొప్పుల తులసి రామ్ గౌడ్ ను ఉమ్మడి కమాన్ పూర్ మండల మాజీ ఎంపీపీ కోలేటి మారుతి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తులసి రామ్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కోలేటి మారుతి.. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

### ఎస్ జి ఎఫ్ గేమ్స్ లో మాస్ట్రో విద్యార్థుల ప్రతిభ




కథలాపూర్ సెప్టెంబర్ 19 (జనం సాక్షి)కథలాపూర్ మండల కేంద్రంలో జరిగిన ఎస్ జి ఎఫ్ గేమ్స్ లో మాస్ట్రో పాఠశాల విద్యార్థులు అండర్ 14 కబడ్డీ విభాగంలో బాలికలు మొదటి స్థానం మరియు అండర్ 14 ఖో ఖో విభాగంలో బాలురు మొదటి స్థానం సాధించడం జరిగింది.అదే విధంగ అండర్ 14 మరియు 17 విభాగంలో చెస్ మొదటి స్థానం మరియు ద్వితీయ స్థానం మాస్ట్రో పాఠశాల కరస్పాండెంట్ తెలపడం జరిగింది. విజయాలు సాధించిన విద్యార్థులకు మాస్ట్రో పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్ ప్రిన్సిపల్ ఆకుల రంజిత్ డైరెక్టర్ ఆకుల రాజేందర్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్, లింబ , బాలమణి మరియు ఉపాధ్యబృందం అభినందించడం జరిగింది.

### పీహెచ్‌డీ పట్టా సాధించిన కేరళ స్కూల్ విద్యార్థి



హుజురాబాద్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి ) :పట్టణంలోని సూపర్ బజార్ రోడ్‌లో గల కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన వెంపటి మధులిక అనే విద్యార్థిని ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి పట్టా పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కాటం సౌజన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని మధులిక 1999-2000 సంవత్సరంలో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి కాగా, కరీంనగర్ ట్రినిటి కళాశాలలో ఇంటర్మీడియట్, వరంగల్ కాకతీయ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, అదే కళాశాలలో ఎంబీఏను పూర్తి చేసింది. హైద్రాబాద్‌లోని ఉస్మానియా విశ్వ విద్యాలయంలో రిసోర్స్ ఆఫ్ హ్యూమన్ అంశంలో పీహెచ్‌డీని సాధించింది. హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. తమ పాఠశాల విద్యార్థినీ పీహెచ్‌డీ పట్టాను సాధించడంపై పాఠశాల డైరెక్టర్లు గౌతమ్‌రెడ్డి, సంపత్, ఉపాధ్యాయులు రాజు, మనోజ్, వాణిశ్రీ, సరిత తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# అభయ ఫౌండేషన్ సహకారంతో భవితపై విస్తృత అవగాహన సదస్సు




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి)** విద్యార్థులు తప్పనిసరిగా లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడమే కాకుండా వాటిని సాధించే దిశగా కృషి చేయాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తద్వారా సమాజంలో ప్రత్యేకమైనటువంటి స్థానాన్ని కైవసం చేసుకుంటారని, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, ఎస్. బాలచంద్ర, అభయ ఫౌండేషన్ చైర్మన్ పల్లవి, అభయ ఫౌండేషన్ స్పీకర్ డాక్టర్ కె.అమర్నాథ్, ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు, సి.ఎం హరీష్ బాబు, స్వదేశీ జాగరన్ మంచ్ రాష్ట్ర అధ్యక్షులతో స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించినటువంటి "భవిత" అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు తప్పనిసరిగా తల్లిదండ్రుల మార్గదర్శకాలను పాటించాలని, గురువులు బోధించినటువంటి విషయాలను నిర్లక్ష్యం చేయకుండా సాధన చేసి వివిధ పోటీ పరీక్షలకు హాజరై ప్రతిభను చాటి ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని వారు తెలిపారు. చాలామంది విద్యార్థులకు భద్రత పట్ల అవగాహన లేకపోవడం వలన ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, సంస్థల్లో విద్యార్థులకు భయం తొలగించడానికి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అభయ ఫౌండేషన్ వారు చేస్తున్నటువంటి కృషి చాలా అభినందనీయమని, వారిలో కలిగినటువంటి అపోహలకు నిపుణులచే కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని తెలిపారు. వారు మాట్లాడుతూ... విద్యాసంస్థల్లో భద్రత అనేది చాలా తప్పనిసరి అని భద్రతను అవలంబించడానికి అనేక మార్గాలు ఉన్నాయని కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటింటా శ్రీరామ హనుమత్ తత్వాన్ని పెంపొందించాలి



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 19, ( జనం సాక్షి)**భక్తి, భజన, ఆధ్యాత్మికత, సేవ అనే నాలుగు ప్రధాన ఆశయాలతో ఇంటింటా శ్రీరామ తత్వం, హనుమత్ తత్వం, ప్రేమతత్వం, మానవతా విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రీ అయోధ్య రామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సామూహిక సత్సంగం, భజన, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నలుమాచు చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం రాత్రి ప్రకాశం గంజిలో వర్తక, వాణిజ్య, వ్యాపార వర్గాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరసిద్ధి వినాయక మండపం వద్ద సంస్థ ఆధ్వర్యంలో సత్సంగం, భజన, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నలుమాచు చంద్రశేఖర్ మాట్లాడుతూ కలియుగం లో నామస్మరణకు మించిన ఔషధం, ఆయుధం లేదన్నారు. పవిత్ర భారతావనిలో హిందువుగా జన్మించినందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మానవ జన్మ అత్యంత విలువైనదని, ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొని జీవితాన్ని సార్థకం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత నాలుగు దశాబ్దాలకు పైగా సమస్త దేవతలను స్మరిస్తూ, భజిస్తూ, ఆరాధిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో కొనసాగుతున్న భక్తుల సహకారంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీరామ, హనుమత్ తత్వాలను ప్రతి ఇంటికీ చేర్చడంతో పాటు ప్రేమ, మానవతా విలువ లను పెంపొందించడమే సంస్థ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో రాణి, దండె రాజ శేఖర్, శ్రీరాముల రాము, విశ్వనాథుల శ్రీనివాస్, జిల్లా కృష్ణమూర్తి, కరుణ, ఎల్లంకి రజిత, ప్రదీప్‌కుమార్, తాటిపల్లి సతీష్‌బాబు, వెలిచాల చంద్రమోహన్, పద్మ, తొడుపునూరు తిరుపతి, వనమాల చంద్రశేఖర్, పుల్లూరి రవీందర్, లక్కాకుల శ్రీదేవి, బొద్ద వేణు, సరోజ తదితరులతో పాటు ప్రకాశం గంజ్ గణనాథుని మండప నిర్వహణ కమిటీ సభ్యులు, వ్యాపారులు, ధార్మిక సోదర, సోదరీమణులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, శేష వస్త్రంతో సన్మానించారు.

# ప్రకృతి వ్యవసాయం సేంద్రియ ఎరువుల వాడకం పై శిక్షణ కార్యక్రమం




**మల్యాల సెప్టెంబర్ 19 (జనం సాక్షి)**ప్రకృతి వ్యవసాయం మరియు సేంద్రియ ఎరువుల వాడకంపై మల్యాల మండలం నూకపల్లి రైతు వేదికలో శనివారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రామన్నపేట సర్పంచ్ వి.మౌర్య,నూకపల్లి సొసైటీ చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డిలు పాల్గొన్నారు.ప్రకృతి వ్యవసాయం లో భాగమైనటువంటి నూకపల్లి మరియు రామన్నపేట రైతులకు బీజామృతం, ఘనజీవామృతం, జీవామృతం,బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం ,దశపరణి కషాయం,భయోచార్,వేప నూనె మరియు వివిధ ఎరువుల ఉపయోగం,తయారీ,వాడకం పై ఏవో కే.చంద్ర దీపక్ వివరించారు.సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ధ్రువీకరణ అధికారులు అయినా జి కుమార్ మరియు శ్రీకాంత్ లు ప్రకృతి వ్యవసాయం వల్ల ఉపయోగాలు,మెలకువలు మరియు ధ్రువీకరణకు అవసరమయ్యే సూచనలను చేశారు. సమావేశం అనంతరం క్షేత్ర సందర్శన లో భాగంగా మిరప,పసుపు తోటలను సందర్శించి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ఈ శ్రీనివాస్, కే.శ్రీనివాస్,రైతులు వి.లక్ష్మారెడ్డి,మంద మల్లేశం గౌడ్,స్వామి రెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో



**ఎడపల్లి, సెప్టెంబర్ 19 ( జనంసాక్షి ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను, ఉత్తమ ఇంజనీర్లను శనివారం ఎడపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ బసవేశ్వర్ రావు, జెడ్పీ శ్రీధర్, ఆర్పీ పాండురంగారావు, పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు శంకర్, మండల విద్యాశాఖ అధికారి.శివలింగ గాలప్ప, మండల అధ్యక్షులు సాయరెడ్డి, ప్రిన్సిపాల్ వేములపల్లి రవికుమార్, జీఎంటీ కో- ఆర్డినేటర్ సూర్య నారాయణ, ఎడపల్లి క్లబ్ ప్రెసిడెంట్ ఎన్. రాకేష్ వర్మ, సెక్రటరీ అరుణ్ కుమార్ గౌడ్, కోశాధికారి కాశీనాథ్, డీసీ గంగారెడ్డి, డీసీ మెర్సీ, పుష్పలత, ప్రకాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా నో బ్యాగ్ డే



**గంభీరావుపేట, సెప్టెంబర్ 19 జనం సాక్షి:**నో బ్యాగ్ డేను పురస్కరించుకొని గంభీరావుపేట జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. తెలంగాణ యాసలో పదాల సేకరణ, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌పై రచనలు, ఆంగ్ల భాషలో క్విజ్, నిత్యజీవితంలో గణితం, ల్యాబ్ యాక్టివిటీ, ఏక్ పేడ్ మా కే నామ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.అలాగే సిరిసిల్ల జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు విద్యార్థుల నుంచి సలహాలు, సూచనలు సేకరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీ విషయంలో



**బోధన్, సెప్టెంబర్ 19 ( జనంసాక్షి ) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మాట మార్చిందని చక్కెర ఫ్యాక్టరీ కార్మికులు ఆరోపించారు. శనివారం ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించి అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు నాగుల రవిశంకర్ గౌడ్, ఉపేందర్, ఎంఐఎం కౌన్సిలర్లు రఫీక్, సమీర్, ఆప్ నాయకుడు జునైద్ మాట్లాడుతూ, 11 సంవత్సరాల నుంచి షుగర్ ఫ్యాక్టరీ లే ఆఫ్ లో పెట్టారని, షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు రావలసిన వేతన బకాయిలు ఇప్పించి నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలని కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే తెరిపిస్తామని ఎన్నికల ప్రచారంలో మాట ఇచ్చిన రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇచ్చిన హామీ లను అమలు చేయాలన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే బాలాల అసెంబ్లీలో నిన్న మాట్లాడిన వారికి ఎంఐఎం పార్టీ ఒవైసీకి కార్మికుల తరుపున ధన్యవాదములు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేటి వరకు మా సమస్య పరిష్కరించలేదని, ప్రధాన ప్రతిపక్షం కనీసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ప్రశ్నించకపోవడం సిగ్గుచేటన్నారు. ఫ్యాక్టరీ సమస్యను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, నాగుల రవిశంకర్ గౌడ్, బాలకృష్ణ, ఈరవేణి సత్యనారాయణ, ఎంఐఎం కౌన్సిలర్లు రఫీక్, సమీర్, కార్మికులు రాంబాబు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేట్ లో ఘనముగా పోషణ మాసం వేడుకలు



**మల్లాపూర్, సెప్టెంబర్19 (జనం సాక్షి)** మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో శనివారం రోజున ఘనముగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు గ్రామ సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు ఇట్టి కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రతిభ, గ్రామ కార్యదర్శి సురేష్,ఎం ఎల్ ఎచ్ పి శైలజ, ఏఎన్ఎం కోమల,అంగన్వాడీ టీచర్లు పద్మ,సంధ్యారాణి, జమున, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణలోనే మొదటి రోబో టీచర్



**సిరిసిల్లలోని** జడ్,పి,హెచ్,ఎస్ గీతానగర్ పాఠశాలలో శనివారం రోజున రోబోటీచర్ తో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా రోబోటీచర్ నిలిచింది.మొదట విద్యార్థుల ప్రగతి సాధించవలసిన సామర్థ్యాల గురించి హెచ్,ఎం శారద వివరించగా,ఉపాధ్యాయులు మైలారం తిరుపతి,రాజలింగం,భూపాల్రెడ్డి,తిరుపతి,స్వప్న,విమోచన,అర్చన,మంజుల తదితరులు విద్యార్థుల సమస్యలు,భవిష్యత్ ప్రణాళిక గురించి మాట్లాడారు.తదనంతరం రోబోటీచర్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకి సమాధానాలు ఇచ్చింది,సందేహాలను నివృత్తి చేసింది.రోబో తో తల్లిదండ్రులు నేరుగా మాట్లాడటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఇండస్ ల్యాబ్ వారు పాఠశాలకు "రోబో టీచర్" ను ప్రదానం చేసిన విషయం విదితమే. ఇది తెలంగాణలోనే ప్రభుత్వ పాఠశాలలో మొదటి రోబో టీచర్ కావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ భరోసా



**గంభీరావుపేట, సెప్టెంబర్ 19 జనం సాక్షి;**అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) భరోసాగా నిలుస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, ఉప సర్పంచ్ బుచ్చగారి అంజయ్య, మండల కార్యదర్శి రాగుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రభుత్వ సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం వైద్య చికిత్సకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘువీరా ప్రసాద్, భాస్కర్, వార్డు సభ్యులు ఎర్రం రవీందర్, ఆంజనేయులు, దేవరాజు, బందెల నర్సయ్య, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి



**యైటింకలైన్ కాలనీ (జనంసాక్షి)సెప్టెంబర్ 19:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామగుండం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి సందర్శించారు. మండపాల్లో కొలువుదీరిన గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులతో కలిసి గణపతి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రామగుండం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని గణనాథుడిని ప్రార్థించినట్లు కందుల సంధ్యారాణి తెలిపారు.అనంతరం 8వ కాలనీలోని ఓసీపీ-3 బేస్ వర్క్‌షాప్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో



ఆమె పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి నిర్వాహకులను అభినందించారు. కార్మిక కుటుంబాలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని కందుల సంధ్యా రాణి పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు .ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు యాదగి రి సత్తయ్య, గట్టు శ్రీనివాస్, 8 ఇంక్లైన్ కాలనీ మండల అధ్యక్షులు ఆకుల శశి, బీజేపీ సీనియర్ నాయకులు మూకిరి రాజు, ఆకుల కుమార్ గౌడ్, కందే సాగర్, గంధం శంకర్, చొప్పరి స్వామి, జక్కన బాలు, మీస వికాస్, పైడిపల్లి విజయ్ గౌడ్, చరణ్, బడుగు జలంధర్, గోపు రామన్న, మేడం రాజు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడి కుటుంబ సమస్యకు ఆర్డీవో చొరవతో పరిష్కారం



**నిజాంసాగర్, సెప్టెంబర్ 19:** కుటుంబ సభ్యులు తనను పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసిన వృద్ధుడి కుటుంబ సమస్యను బాన్సువాడ ఆర్డీవో రవీందర్‌రెడ్డి చొరవ తీసుకుని పరిష్కరించారు. నిజాంసాగర్ మండలంలోని బంజేపల్లి గ్రామానికి చెందిన మేకల రాములు, తన కుటుంబ సభ్యులు తనను పట్టించుకోవడం లేదని పేర్కొంటూ తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమం మరియు నిర్వహణ చట్టం--2007 ప్రకారం బాన్సువాడ ఆర్డీవో రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుపై స్పందించిన ఆర్డీవో రవీందర్‌రెడ్డి శనివారం సాయంత్రం బంజేపల్లి గ్రామంలోని మేకల రాములు ఇంటికి వెళ్లారు. ముందుగా వృద్ధుడితో మాట్లాడి ఆయన సమస్యను తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి కుటుంబంలో నెలకొన్న విభేదాలకు గల కారణాలను తెలుసుకున్నారు. ఇరువర్గాల అభిప్రాయాలను తెలుసుకున్న ఆర్డీవో, కుటుంబ సభ్యులు పరస్పరం అర్థం చేసుకుని, ఒకరినొకరు గౌరవించుకుంటూ కలిసి మెలిసి జీవించాలని సూచించారు.కుటుంబంలో చిన్నచిన్న విషయాల కారణంగా గొడవలు తలెత్తకుండా పరస్పర సహకారంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన హితవు పలికారు. వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, వారి బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందని సూచించారు. ఇకపై కుటుంబంలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా ప్రశాంతమైన వాతావరణంలో సఖ్యతతో జీవించాలని ఆర్డీవో రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సూచించారు.ఆర్డీవో చొరవతో ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో కుటుంబ సభ్యులు కూడా పరస్పరం అర్థం చేసుకుని కలిసి ఉండేందుకు అంగీకరించినట్లు తెలిపారు. వృద్ధుల సమస్యలను అధికారులు చట్టపరమైన అంశాలతో పాటు మానవతా దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ తహసీల్దార్ సాయి భుజంగరావు, ఎంపీడీవో శివ రామకృష్ణ, ఎస్సై శివకుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహేష్ కానిస్టేబుల్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



గోదావరిఖని, జనంసాక్షి :వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి తెలిపారు.శనివారం అంతర్గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని గోలివాడ గోదావరి నది వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను గోదావరిఖని ఏసీపీ రమేష్,సీఐ కృష్ణ కుమార్‌లతో కలిసి డీసీపీ పరిశీలించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, బుధవారం జరగనున్న వినాయక నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలీసులు, మున్సిపల్,విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిమజ్జన ఊరేగింపు, నిమజ్జన మార్గాలను ముందుగానే పరిశీలించాలని సూచించారు. రహదారులపై ఉన్న గుంతలు, అడ్డంకులు,విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలను గుర్తించి అవసరమైన మరమ్మతులు, భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వినాయక విగ్రహాల ఊరేగింపునకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, ఊరేగింపు మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ప్రజలు,ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించి, నిబంధనలు పాటిస్తూ వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని పోలీసులు సూచించారు.

# సింగరేణి కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

కొత్తగా ఇళ్ల నిర్మాణానికి తగిన అవకాశాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. గతంలో పరిశ్రమలు, గనుల కారణంగా అభివృద్ధి చెందిన అనేక ప్రాంతాలు ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి, వాటిని కార్మికుల గృహ నిర్మాణానికి వినియోగించే అవకాశం కల్పించాలని సూచించారు.కార్మికులకు సుమారు 100 గజాల స్థలం కేటాయించి, వారి హెచ్ఆర్ఏ, ఇతర ప్రయోజనాలను వినియోగించుకునే విధంగా గృహ నిర్మాణానికి అవకాశం కల్పిస్తే సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందుకు అవసరమైన రుణ సదుపాయాన్ని కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రామగుండం నియోజకవర్గానికి మంజూరైన ఆర్ అండ్ బి రోడ్ల పనులు టెండర్లు పూర్తయినప్పటికీ ఏడాది కాలంగా ప్రారంభం కాకపోవడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.రోడ్ల పనులకు టెండర్లు పూర్తయిన తర్వాత రివైజ్ చేసి, కాంట్రాక్ట్ ప్రక్రియ పూర్తిచేసి తిరిగి హైపవర్ కమిటీకి పంపించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు.ఈ అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా దృష్టి సారించి హైపవర్ కమిటీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.హైపవర్ కమిటీకి సంబంధించిన ప్రక్రియను వెంటనే క్లియర్ చేసి, రోడ్ల పనులను ప్రారంభిస్తే కనీసం ఈ సంవత్సరంలోనే పనులు ప్రారంభమై ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు.అలాగే రామగుండం ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి అత్యంత కీలకమైన 1.800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను మరింత ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ట్రాఫిక్ నియంత్రణకు నూతన ఔట్‌పోస్ట్ బూత్‌లు

## తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తాలో ప్రారంభించిన సీపీ గౌస్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తాలో ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ ఔట్‌పోస్ట్ బూత్‌లను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం రోజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడంతో పాటు నిరంతరం పర్యవేక్షించేందుకు ఈ ఔట్‌పోస్ట్ బూత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామితో పాటు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, సబ్–ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజంపేట మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు

## విజేతలకు జ్ఞాపికలు అందజేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**

రాజంపేట మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ హాజరై విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. విజయం సాధించిన క్రీడాకారులు అదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఓటమి చెందిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా గెలవాలనే పట్టుదలతో మరింత కృషి చేయాలని సూచించారు. క్రీడాకారులు తమ తల్లిదండ్రులు, గురువులు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఆకుల బాబు, దోమలగూడ స్పోర్ట్స్ స్కూల్ ఫ్యాకల్టీ శివరాజు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, పీఆర్‌టీయూ అధ్యక్షులు సంతోష్, స్వామిగౌడ్, సాయి మౌర్య, సంఘాగౌడ్, సంతోష్, బాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ నిర్వహణ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్

## - జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్

**పెద్దపల్లి,సెప్టెంబర్ 19(జనంసాక్షి) :**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా శాఖ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుల ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా శాఖ నిర్వహణ కమిటీలోని మొత్తం లి15 స్థానాలకులి ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైతే అక్టోబర్ 4, 2026న రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.– సెప్టెంబర్ 24న నామినేషన్ల స్వీకరణ : నిర్వహణ కమిటీ సభ్యుల పదవులకు పోటీ చేయదలచిన అభ్యర్థుల నుంచి సెప్టెంబర్ 24, 2026న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు,నామినేషన్లను లిజిల్లా ఉపాధి కార్యాలయం కలెక్టరేట్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, రూమ్ నెం. 233లో దాఖలు చేయాలని పేర్కొన్నారు.– సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన : సెప్టెంబర్ 25న ఉదయం 10.00 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహించి, చెల్లుబాటయ్యే నామినేషన్ల జాబితాను ప్రకటించనున్నట్లు, సెప్టెంబర్ 26న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదే రోజు తుది నామినేషన్ల జాబితాను ప్రకటించి, ఎన్నికల గుర్తులను కేటాయించనున్నట్లు తెలిపారు.– అక్టోబర్ 4న పోలింగ్.. అనంతరం ఓట్ల లెక్కింపు : అవసరమైతే అక్టోబర్ 4న ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. సాయంత్రం 4.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యవర్గ బాధ్యుల ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన కార్యక్రమాలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.– నామినేషన్ ఫీజు రూ.10,000 : నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు రూ.10,000/– నామినేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, ఈ ఫీజు తిరిగి చెల్లించబడదని ,ఎన్నికలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ఎన్నికల అధికారి ఫోన్ నంబర్ 9640016079ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# వినాయకచవితి నవరాత్రుల సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమం

## భక్తిశ్రద్ధలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్పు ఉమారాణి శ్రీనివాస్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 (జనం సాక్షి )

వినాయకచవితి నవరాత్రుల సందర్భంగా కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్పు ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ వినాయకచవితి నవరాత్రులను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. పండుగను భక్తి, శాంతి, సోదరభావంతో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆూఖ మధుసూదన్, అవి నరహరి, ఓఖీూ హిమబిందు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఏజిఆర్ ట్రస్ట్ సేవలతో ముందుకు సాగుతాం

## బిఆర్ఎస్ నాయకురాలు విజయ భారతి



**ఆర్మూర్, సెప్టెంబర్ 19 ( జనంసాక్షి):** తన తండ్రి ఆలూరు గంగారెడ్డి ఆశయాలకు అనుగుణంగా రాజకీయంలో ముందుకు సాగుతామని బిఆర్ఎస్ నాయకురాలు విజయభారతి అన్నారు.ఆలూరు మండల కేంద్రంలో వారి వ్యవసాయ క్షేత్రంలో మీడియా సమావేశం నిర్వహించి శనివారం మాట్లాడారు.తన తండ్రి ఆలూరు గంగారెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి రైతుగా,రాజకీయంగా, ఉద్యమకారుడిగా పనిచేశారని వాక్యానించారు.ఏజిఆర్ ట్రస్ట్ పేరిట బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక సహాయం అందిస్తూ ముందుకు సాగుతామన్నారు.తండ్రి నేర్పిన విలువలు,వారి అనుచర గణం,రాజకీయ పాఠాలు అందరి మదిలో గుర్తుంటాయన్నారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని,రాజకీయ వారసురాలిగా పార్టీ ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీలో ఉంటానని చెప్పారు.ప్రముఖ నేత అరవింద్ శర్మ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలోనూ,ప్రాంత అభివృద్ధిలోనూ గంగారెడ్డి అందించిన సేవలు మరవరానివని పేర్కొన్నారు.ఏజీఆర్ ట్రస్ట్ ద్వారా గత నాలుగేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని,అందులో భాగంగా గ్రామానికి చెందిన 22 ఏళ్ల క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం అందించామని తెలిపారు.రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు,మహిళలకు క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బార్ల మనీష్,గంగారెడ్డి,మహేందర్, సూర్య రెడ్డి,సవీన్,హరీష్,ఆలూరు గంగారెడ్డి ఆత్మీయులు,బంధుమిత్రులు,పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గణేశుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

**- భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం - మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**





సుల్తానాబాద్,సెప్టెంబర్ 19(జనంసాక్షి) : మున్సిపల్ పరిధిలోని పూసాల రోడ్డులో పూసాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వైస్ ప్రెసిడెంట్,బిఆర్ఎస్ యువ నాయకులు,చొప్పరి అరుణ్ కుమార్,ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హాజరయ్యారు.గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గణేష్ ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, సామాజిక స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.అన్నదానం చేయడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమమని ఆయన అన్నారు. ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని, ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. భక్తులు గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అందరూ సహకరించాలని సూచించారు.

– మాజీ ఎమ్మెల్యేకు ఘన సన్మానం : అనంతరం కార్యక్రమ నిర్వాహకులు చొప్పరి అరుణ్ కుమార్, అంజలి దంపతులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, అన్నదాన కార్యక్రమం గురించి నిర్వాహకులను మాజీ ఎమ్మెల్యే అభినందించారు.కార్యక్రమ నిర్వాహకుడు చొప్పరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు,స్థానిక ప్రజల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పారుపల్లి గుణపతి,పసేడ్ల మమత సంపత్, అనుమాల బాపూరావు,బిఆర్ఎస్ యువ నాయకులు పురం రమణ,చొప్పరి లక్ష్మరాజం,బొజ్జ శరత్ కుమార్,చొప్పరి అంజయ్య,వేయికంద్ల నరేందర్,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,చొప్పరి సాయికుమార్,శివ,ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.




## మండల సమావేశంలో కరెంటు కోతలపై ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచులు

**- కరెంట్ ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి**

**- ఇంకుడు గుంతలపై దృష్టి సారించాలి. మండల సమావేశంలో ఎంపీడీవో దివ్యదర్శనరావు**

సుల్తానాబాద్,సెప్టెంబర్ 19(జనంసాక్షి) : శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో దివ్యదర్శనరావు అధ్యక్షతన నిర్వహించగా గ్రామాల సర్పంచులతోపాటు పలువురు అధికారులు హాజరయ్యారు.సమావేశంలో కరెంటు కోతలపై పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటు ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి ఉందని తెలిపారు. కరెంటు కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఏఈ కిషోర్ కు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దివ్యదర్శనరావు మాట్లాడుతూ గ్రామాలలో ఇంకుడు గుంతలపై అధికారులు దృష్టి సారించి సర్వే నిర్వహించాలని, ఇప్పుడు గుంతల నిర్మాణం కచ్చితంగా జరగాలని సూచించారు. కాకుండా 318 పనులలో అధికారులు మౌలిక వసతులపై దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ తో పాటు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు నామని రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడాటి సాయి కిరణ్,తదితరులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమాజంలో గురువులే మార్గ నిర్దేశకులు. మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

సుల్తానాబాద్,సెప్టెంబర్ 19(జనంసాక్షి) : సమాజంలో గురువులే మార్గ నిర్దేశకులని, నేడు వివిధ ఉన్నత రంగాలలో ఉన్నామంటే గురువుల పాత్ర అమోఘమని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు.శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని 32 మంది ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులకు, ఉత్తమ ఉపాధ్యాయ ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ ఎంపీడీవో దివ్య దర్శన్ రావు ఎంఈఓ ఆరెపల్లి రాజయ్య మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటిపుష్పలత, తొర్రి కొండ ప్రభాకర్ మాట్లాడుతూ, సమాజంలో గురువులు లేకపోతే నిరక్షరాస్యతతో, అనేక రుగ్మతలకు కారణం అవుతామని, అలాంటి గురువులు విద్యార్థి దశ నుండే ఉన్నతులుగా తీర్చిదిద్ది ప్రయోజకులుగా చేయడంలో శక్తివంచన లేకుండా చేస్తున్న కృషి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.గురువులు విద్యార్థుని విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఎదుర్కొంటున్న సమస్యలను, ఓపికతో పరిష్కారం చేసుకోవాలని,పిల్లల తల్లిదండ్రులతో మమేకం ఐ,వారిని చైతన్యం చేయాల్సిన బాధ్యత ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత ఎంపీడీవో దివ్య దర్శన్ రావు,కౌన్సిలర్ తొర్రికొండ ప్రభాకర్,మండలంలోని ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ఉచిత వేతనం.. బెదిరింపుల పర్వం అధికారులను బెంబేలెత్తిస్తున్న అటెండర్ బి. గంగారాం లీలలు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనంసాక్షి: జిల్లా గ్రంథాలయ సంస్థ నిజామాబాద్ ప్రభుత్వ కార్యాలయంలో విధులు నిర్వర్తించాల్సిన బురిగేడి. గంగారాం అనే అటెండర్ పై స్థాయి అధికారులకే చుక్కలు చూపిస్తున్న వైనం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఏకధాటిగా సెలవులు మీద సెలవులు పెడుతూ... విచారించాల్సిన, వేతనం ఇవ్వాల్సిన అధికారులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పేరుతో బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.నిబంధనల ప్రకారం ఆఫీసులో ఉండాల్సిన సదరు వ్యక్తి ,ఆఫీసర్లు వాడే కార్లలో షికార్లు చేస్తూ అధికారులను శాసిస్తున్నాడని సమాచారం.విధి నిర్వహణలో నిలదీయాల్సిన ఉన్నతాధికారులు సైతం ఆయన బెదిరింపులకు భయపడి మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ, అధికారులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఈ అటెండర్ పై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి, సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధ్యులు, స్థానికులు, పాఠకులు, కోరుతున్నారు.


GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF PUBLIC LIBRARIES

EMP ID: 6567735

B. GANGARAM
Father's Name : Burigedi Chinna Sallu
Date of Birth : 03-04-1985
Designation : Office Subordinate
Place of Work : Govt. Regional Library Chandrashekar Colony Nizamabad-503002.

P. L. Rajyam
GAZETTED LIBRARIAN
REGIONAL LIBRARY
NIZAMABAD.

Personal Details:
Identification Mark : Two moles on the right wrist
Aadhaar No : 7683 4744 5999
Present Address : H.No.1-11-539, Chandrashekar Colony Nizamabad, Pin- 503002
Permanent Address: H.No. 1-68/2, Akbar Nagar, Rudrur Mdl. Nizamabad Dist.
Mobile No : 9963257971 / 9032962887

Signature of the Employee




# అన్ని దానాల్లో అన్నదానం గొప్ప

**- తాహశీల్దార్ దాసరి రాజ మల్లయ్య,ఎస్ఐ రాజు**



రామడుగు(జనంసాక్షి): వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రామడుగు గ్రామంలో మాల సంఘం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ నిహ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ అన్నదానానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా ఎస్సై కే రాజు, తాసిల్దార్ దాసరి రాజ మల్ల య్య, మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుని కృపతో ఏటా ఈ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. 'అన్నదానం మహాదానం' అనే సంకల్పంతో ప్రతి ఒక్కరికీ స్వామివారి ప్రసాదాన్ని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. , ఉత్సవ కమిటీ సభ్యులు.స్వచ్ఛంద సేవకులు పూర్తి సహకారాన్ని అందించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నదాన వేదిక వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ కమిటీ సభ్యులు స్వయంగా వడ్డించి, క్రమశిక్షణతో ప్రసాద వితరణ సాగేలా పర్యవేక్షించారు. అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులు భక్తులకు, సహకరించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మొయిజ్, 14వ వార్డ్ మెంబర్ సిరికొండ పల్లవి సాయి, ఉత్సవ కమిటీ మెంబర్స్, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## వేములవాడ సింగిల్ విండో చైర్మన్‌గా వకుళభరణం శ్రీనివాస్



వేములవాడ(జనంసాక్షి): వేములవాడ సింగిల్ విండో కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా నూకలమర్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వకుళభరణం శ్రీనివాస్ నియామకం అయ్యారు. నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న ఆయనకు స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు సహకార సంఘం సభ్యులు శుభాకాం క్షలు తెలిపారు.ఈ సందర్భంగా వకుళభరణం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, నాయకులకు సొసైటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా, సొసైటీ అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని, సహకార సంఘం సేవలను మరింత వేగవంతం చేసి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు.

## వినాయక నిమజ్జనానికి పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

**- భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి**

**- పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**



పెద్దపల్లి,సెప్టెంబర్ 19(జనంసాక్షి) : వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పెద్దపల్లి పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి,పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, పోలీస్ అధికారులు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్,విద్యుత్ శాఖ అధికారులు, ఇరిగేషన్ శాఖ ఏఈఈ, మత్స్యశాఖ,వైద్య ఆరోగ్య శాఖ, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ప్రజలు, భక్తులు, మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసులు సూచించే భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.మండపాల నిర్వాహకులు నిమజ్జన శోభాయాత్ర సమయంలో క్రమశిక్షణ పాటించాలని, నిర్ణయించిన మార్గాలు, నిబంధనలకు అనుగుణంగా శోభాయాత్ర నిర్వహించాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.- మినీ ట్యాంక్‌బండ్ నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు : సమావేశం అనంతరం డీసీపీ బి. రామ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు మినీ ట్యాంక్‌బండ్ నిమజ్జన ప్రాంతాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులు ప్రమాదవశాత్తు నీటిలోకి వెళ్లకుండా అవసరమైన బారికేడింగ్,విద్యుత్ దీపాల ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, రాకపోకల నియంత్రణ,విద్యుత్ భద్రత తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన సిబ్బంది, ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల నిలుపుదల, రాకపోకలు, అత్యవసర వాహనాలకు మార్గం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు,భక్తులు, మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు చేపడుతున్నట్లు డీసీపీ తెలిపారు.



**ఎస్ జి ఎఫ్ ఐ పెద్దపల్లి జోనల్ స్థాయి వాలీబాల్ క్రీడా లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులకు మొదటి బహుమతి**

**- జిల్లా స్థాయికి ఎంపిక**

**పెద్దపల్లి రూరల్,సెప్టెంబర్ 19(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో శుక్రవారం జోనల్ స్థాయి వాలీబాల్ క్రీడలో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చూపారు. విద్యార్థులు కే గౌతం,8వ తరగతి అండర్ 14 వాలీబాల్ మొదటి స్థానం, అండర్ 17 జి ప్రభాస్ 9వ తరగతి మొదటి స్థానం. విజయం సాధించి పెద్దపల్లి జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారు. విద్యార్థుల ఎంపిక పట్ల గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యార్థులను అభినందించి మెమొంటోస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్,వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్ కుమార్,మహేందర్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బొంపల్లి లో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం

**- చెడిపోయిన కరెంటు స్తంభాలు,చుట్టుకుపోయిన విద్యుత్ వైర్లు,మెయిన్ బాక్స్**



పెద్దపల్లి రూరల్,సెప్టెంబర్ 19(జనంసాక్షి) : బొంపల్లి గ్రామంలో పల్లె బాటలో భాగంగా 6 నెలల క్రితం విద్యుత్ శాఖ వారు,గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ పాలకవర్గం గ్రామం మొత్తం తిరిగి డ్యామేజ్ మరియు లూజ్ హోల్స్ క్రింద 18 పోలులను గుర్తించడం జరిగిందని గ్రామ ప్రజలు తెలిపారు. దానికి సంబంధించిన పోలుల సాంక్షన్ మరియు ఎస్టిమేషన్ కూడా పూర్తి అయినప్పటికీ ఇంతవరకు బొంపల్లి గ్రామంలో ఆ పోలులను ఏర్పాటు చేయ లేదనీ సర్పంచ్ మరియు పాలకవర్గం అలాగే గ్రామ ప్రజలు కూడా అనేకసార్లు కరెంటు( ఏ ఇ)ని ఈ విషయమై అడగగా ఏస్తామని చెప్పడమే గాని పని పూర్తిచేసిన దాఖలు లేవనీ. గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ ఎ ఇ ఈ విషయంలో అశ్రద్ధ చూపడమే కాకుండా నిర్లక్ష్యపు సమాధానాలు చెప్పడం జరుగుతుందనీ తెలిపారు. వర్షం కొట్టినప్పుడు మరియు ఇతర సందర్భాల్లో లైన్స్ లూజ్ ఉండటం వల్ల షార్ట్ సర్క్యూట్ ఏర్పడి కరెంటుకి అంతరాయం ఏర్పడడమే కాకుండా ప్రజలు ఇబ్బంది పడడం జరుగుతుందనీ గ్రామ ప్రజలు వాపోతున్నారు.

# బాలల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**- ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల**

**- పిల్లల హక్కులు, పోక్సో చట్టంపై ప్రతి ఉపాధ్యాయుడికి అవగాహన అవసరం**

**- మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**- మిషన్ బాల సురక్ష--శిక్షా,న్యాయ 2026లో భాగంగా ఉపాధ్యాయులకు ఒకరోజు అవగాహన కార్యక్రమం**



**పెద్దపల్లి,సెప్టెంబర్ 19(జనంసాక్షి) :** పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, రక్షణతో పాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మిషన్ బాల సురక్ష--శిక్షా, న్యాయ 2026లో భాగంగా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నామినేట్ చేసిన ఉపాధ్యాయులకు పిల్లల హక్కులపై వన్ డే సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల,అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (పోక్సో) కె. స్వప్న రాణి,డీసీపీ రాంరెడ్డి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, రక్షణతో పాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా అవగాహన ఒప్పందం (ఎం ఓ యు) కుదుర్చుకున్నాయని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రుల కంటే ఎక్కువ సమయం పాఠశాలల్లో ఉపాధ్యాయులతో గడుపుతారని, కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులతో పంచుకోలేని సమస్యలను కూడా ఉపాధ్యాయులతో పంచుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులకు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అఘాయిత్యాలను అరికట్టడంతో పాటు పిల్లలను రక్షించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. పిల్లలపై నేరాలకు పాల్పడే వారిలో ఎక్కువ మంది వారికి తెలిసినవారే ఉండే అవకాశం ఉన్నందున, పిల్లల భద్రత విషయంలో ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

- పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి : పిల్లలకు చదువుతో పాటు మంచి నడవడిక, రక్షణ, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించడం ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల ముఖ్య బాధ్యత అని జిల్లా జడ్జి తెలిపారు. బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం గురించి, బాలురు,బాలికలకు లభించే చట్టపరమైన రక్షణలు, న్యాయపరమైన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు అకస్మాత్తుగా మౌనంగా ఉండటం,చురుగ్గా లేకపోవడం వంటి ప్రవర్తనా మార్పులను ఉపాధ్యాయులు గుర్తించాలని తెలిపారు. పిల్లల సమస్యలను ముందుగానే గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించడం ద్వారా వారిని రక్షించవచ్చన్నారు. పాఠశాలల్లో పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, విద్యార్థుల స్నేహితుల వలయాన్ని కూడా గమనించాలని సూచించారు. పిల్లలతో శరీర మార్పులు, లైంగిక అంశాలు, మంచి స్పర్శ- చెడు స్పర్శ వంటి అంశాలపై తల్లిదండ్రులు ఇంటి నుంచే చర్చించి, వారికి అవసరమైన భద్రతా సూత్రాలను నేర్పించాలని తెలిపారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించడానికే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక స్థితిని కూడా గమనించాలని, కార్యక్రమంలో పొందిన అవగాహనను తమ పాఠశాలల్లోని తోటి ఉపాధ్యాయులకు కూడా విస్తరించాలని సూచించారు.

- మాదకద్రవ్యాల నివారణపై అప్రమత్తంగా ఉండాలి - డీసీపీ రాంరెడ్డి : విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని డీసీపీ రాంరెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో 6, 7, 8వ తరగతుల విద్యార్థుల్లో కూడా కొన్ని రకాల వ్యసనాల ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సంకేతాలు,అనుమానాలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు 112 నంబర్‌కు సమాచారం అందించి అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని శ్రద్ధగా తీసుకుని, పాఠశాలలకు వెళ్లిన అనంతరం తోటి ఉపాధ్యాయులకు కూడా బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని డీసీపీ కోరారు.

- "జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్" పోస్టర్ ఆవిష్కరణ : అనంతరం సాధన సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన లి"జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ లి పోస్టర్‌ను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచల ఆవిష్కరించారు. బాలల హక్కులు, వారి రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశం, జిల్లా విద్యాశాఖ అధికారి (ఇన్‌చార్జి) వి. హన్మంతు, గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కవిత, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జితేందర్,లీగల్ కం ప్రొవిషన్ ఆఫీసర్ రజిత,న్యాయ, పోలీస్,విద్యాశాఖ అధికారులు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నామినేట్ చేసిన ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జిగా అంబాల నరేష్ మాదిగ



సుల్తానాబాద్, సెప్టెంబర్ 19(జనంసాక్షి) : ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సుల్తానాబాద్ మండల ఇన్‌చార్జిగా అంబాల నరేష్ మాదిగను నియమించినట్లు ఎంఎస్పీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి చెన్నూరి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణ, అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని చెన్నూరి శ్రీనివాస్ మాదిగ సూచించారు. మండలంలోని ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తూ ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీని బలోపేతం చేయాలని అంబాల నరేష్ మాదిగను కోరారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని అంబాల నరేష్ మాదిగ తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆశయాల సాధనకు,సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.



# ఘనంగా జన్మదిన వేడుకలు

**కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 19 ( జనంసాక్షి ) :**
కరీంనగర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ మరియు గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా ట్రెజరర్ నాగరాజు గారి జన్మదిన వేడుకలను టీజీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాలిచరణ్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీవోస్ అసోసియేషన్ నాయకులు, టీఎన్జీవోల సంఘం నాయకులు, ఉద్యోగులు కలిసి నాగరాజుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి, శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరెన్నో విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో, ఉద్యోగ సంఘాల కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం అవుతూ అందరితో స్నేహపూర్వకంగా మెలిగే నాగరాజుకి నాయకులు, ఉద్యోగులు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో టీజీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, మడిపెల్లి కాళి చరణ్ గౌడ్ టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు టీజీవోస్ నాయకులు గడ్డం సుధాకర్ రాజేశ్వరి లక్ష్మీనరసింహారావు మామిడి రమేష్ రాజు నాయక్ కొండల్ రెడ్డి జలాలుద్దీన్ అక్బర్ రాజమహేందర్ పెండ్యాల కేశవరెడ్డి టీఎన్జీవోల సంఘం నాయకులు, గూడ ప్రభాకర్ రెడ్డి రాగి శ్రీనివాస్ రమేష్ గౌడ్ రాజేష్ భరద్వాజ్ నేరెళ్ళ కిషన్ అస్గర్ అలీ అక్బర్ కోట రామస్వామి శంకర్ శశిధర్ వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు తదితరులు పాల్గొని నాగరాజుకి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ ఆవుల తిరుపతి



వీణవంక సెప్టెంబర్ 19(జనం సాక్షి)వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ ఎంపీ పీఎస్ పాఠశాల విద్యార్థులకు శనివారం వీణవంక పోలీస్ స్టేషన్ లో కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగాఎస్ఐ ఆవుల తిరుపతి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థిని,విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరును,పోలీస్ స్టేషన్ లో నిర్వహించే విధులు,పౌరులు పొందాల్సిన సేవల గురించి వివరించారు. విద్యార్థులకు డయల్ 112,షీ టీమ్,సైబర్ క్రైమ్,ఆయుధాల పనితీరు,డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే నష్టలు,డ్రగ్స్ వాడినప్పుడు మూత్రం ద్వారా టెస్ట్ చేసి నిర్ధారించవచ్చని అన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండే పోలీస్ డిపార్ట్మెంట్ అని ఫింగర్ ప్రింట్ ద్వారా పాత నేరస్తుల ను గుర్తుపట్టడానికి సులభంగా ఉంటుందని వివిధ అంశాలపై పాఠశాలవిద్యార్థిని,విద్యార్థులకు, పోలీస్ భరోసా సెంటర్,ఫ్రెండ్లి పోలీసింగ్ విధానం మైనర్ విద్యార్థులు బైకులు గాని వాహనాలు గాని నడప రాదని వారికి సూచించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు జీవితంలో సాధించాల్సిన అంశాల గురించి,చదువు ప్రాముఖ్యత గురించి వారికి తెలియజేశారు. ఇట్టి కార్యక్రమం ద్వారా విద్యార్థులలో పోలీస్ శాఖ పట్ల అవగాహన పెంపొందించడం తోపాటు పోలీసులు ప్రజల మధ్య స్నేహ పూర్వక సంబంధాలను బలోపేతం చేయడం పోలీసుల ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆవుల తిరుపతి,పాఠశాల ఉపాధ్యాయులు,పాఠశాల విద్యార్థులు,పోలీస్ కానిస్టేబుల్స్, మహిళ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పెద్దపల్లి నూతన బస్సు డిపో పనులను పరిశీలించిన ఈ డి. రాజశేఖర్



**పెద్దపల్లి,సెప్టెంబర్ 19(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ఆర్టీసీ బస్సు డిపో పనులను పరిశీలించిన (ఈ డి) రాజశేఖర్. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్ తో అధికారులతో, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బస్సు డిపో మైదానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారితో ఈ డి సోలమన్, ఈ ఈ శ్రీకాంత్, ఎస్ ఎం రామ్ గోపాల్ రెడ్డి, శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.



## సాలూర మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**బోధన్, సెప్టెంబర్ 19 ( జనంసాక్షి ) :**
సాలూర మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దార్ నవాజ్ హుస్సేన్ తో కలిసి మండల కాంగ్రెస్ నాయకులు ఈ కార్డులు, చెక్కులను పంపిణీ చేశారు. ఈ మేరకు పది మంది లబ్ధిదారులకు రూ. 3,50,000 విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కృషి చేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎడపల్లి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సురేష్



**ఎడపల్లి, సెప్టెంబర్ 19 ( జనంసాక్షి ) :**
ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శనివారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ సందర్శించారు. ఫార్మసీ డిస్పెన్సింగ్ రూమ్ మరియు ఫార్మసీ ప్రధాన దుకాణాలను సందర్శించి, గడువు ముగిసే మందులు ఏమైనా ఉన్నాయా అని మరియు మందుల వాడకం ముగింపు తేదీని తెలియజేయాలని ఫార్మసిస్ట్ ను ఆదేశించారు. ఓపీ రూమ్, ఐపీ వార్డులు, ల్యాబ్, బిఎమ్ డబ్ల్యూ, వాష్ రూమ్ లు చెక్ చేసిన ఆపరేషన్, అటెండెన్స్ రిజిస్టర్ ను సందర్శించారు. సూపర్వైజర్లతో సిబ్బందితో సంభాషించి విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎడపల్లి ప్రాథమిక కేంద్ర వైద్యులు డాక్టర్ వినీత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## కరెన్సీ గణనాథుడు

**- రూ..9,99,999 కరెన్సీ తో అలంకరణ**

**- ఆర్యవైశ్య భవన్ లో భక్తులను ఆకట్టుకున్న గణనాథుడు**



సుల్తానాబాద్,సెప్టెంబర్ 19(జనంసాక్షి) : పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో ఆర్యవైశ్య భవన్ లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర స్వామి వారికి 9,99,999 రూపాయల కరెన్సీ మాలలతో శుక్రవారం రాత్రి అలంకరించారు. ఇందులో 20, 50,0 100, 500 నోట్ల తో గణనాథుని అందంగా అలంకరించారు, భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని కరెన్సీ అలంకరణలో ఉన్న గణేష్ ని ఆసక్తిగా తిలకించారు. పూజా కార్యక్రమంలో చకిలం మారుతి లత, చిట్టి మల్ల వినయ్ వర్షిత దంపతుల చే అర్చకులు పారువెల్ల అభిషేక్ శర్మ పూజలు చేయించారు. ఈ కార్యక్రమం లో, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి,అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్,సెక్రటరీ తోడుపునూరి రాజేంద్రప్రసాద్,క్యాషియర్ కొమురవెల్లి (కేబి) శ్రీనివాస్, పట్టణ మహిళా అధ్యక్షురాలు బాదం వాణి,పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.




## ఏ1 నిందితుడి అరెస్టు రిమాండ్ కు తరలింపు

**మల్యాల సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**
ట్రాన్స్ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనాల కేసులో పరారీ లో ఏ1 నిందితుడు తపాలా బాబు(42) శనివారం ఉదయం సమయంలో మల్యాల శివారులో బైపాస్ దారిలో వెళ్తున్నాడన్న సమాచారంతో ఎస్సై సందీప్ సిబ్బందితో వెళ్ళి బైక్ పై వెళ్తున్నా నిందితుడిని అదుపులోకి తీసుకొని అపాచీ టూవీలర్ బైక్,మొబైల్ ఫోన్,కాపర్ వైర్ 15 కిలోలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ రిమండ్ కు తరలించినట్లు తెలిపారు. కాపర్ వైర్ దొంగతనంలో కోట శ్రీను,పల్లెపు సురేశ్,సూర సురేశ్ నిందితులను సెప్టెంబర్ 17వ తేదీని అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు.

### ప్రధానమంత్రి ఫ్లెక్సీలకు అనుమతి ఇవ్వకపోవడం సిగ్గుచేటు మండల పార్టీ అధ్యక్షులు సిర్ప సుదర్శన్

**బోధన్, సెప్టెంబర్ 19 ( జనంసాక్షి ) :**
భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన ఫ్లెక్సీలకు అనుమతి నిరాకరించడం కాంగ్రెస్ ప్రభుత్వ సంకుచిత రాజకీయ బుద్ధికి నిదర్శనమని బోధన్ మండల బిజెపి అధ్యక్షులు సిర్ప సుదర్శన్ ఆరోపించారు. బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో పది రోజుల ముందే రుసుము చెల్లిస్తామని చెప్పి అనుమతి కోరినా అధికారులు ఫ్లెక్సీలకు అనుమతి నిరాకరించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ వివక్షపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారు ఎలా స్పందిస్తారో వేచి చూస్తామన్నారు. అధికారుల పక్షపాత వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఈ విషయంలో న్యాయం జరగకుంటే చర్యలు తప్పవని సిర్ప సుదర్శన్ హెచ్చరించారు.

### మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీలను అరికట్టాలి - జడ్జి దుర్గం గణేశ్

సుల్తానాబాద్,సెప్టెంబర్ 19(జనంసాక్షి) : మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీలను అరికట్టాలని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ" అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ బలవంతంగా భయపెట్టి మోసంతో మనుషులను రవాణా చేయడం, మహిళలు , బాలికలపై లైంగిక దాడులు చేయడం చట్టరీత్యా పెద్ద నేరమని, విద్యార్థులు ఇలాంటి సంఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధి పేరుతో మహిళలను అక్రమంగా రవాణా చేసి లైంగిక దోపిడీలకు పాల్పడే ముఠాల పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటటున్నారని, ఇలాంటి కేసులకు సంబంధించి నేరస్థులకు ప్రత్యేక కోర్టుల ద్వారా జీవిత ఖైదు విధించిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి సారించాలని సూచించారు,అనంతరం జడ్జి గణేష్ మాదక ద్రవ్యాలను అరికడతామని విద్యార్థులచే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ,సెంకడ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య,, లోక్ అదాలత్ సభ్యులు మాదూరి ఆంజనేయులు,బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, సంయుక్త కార్యదర్శి గుడ్ల వెంకటేష్,న్యాయవాదులు బొబ్బిలి శ్యామ్,వేముల స్నేహ,మాదూరి పృథ్వీ,ఆకారపు రామకృష్ణ రెడ్డి,కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత,ఎక్సైజ్ సిఐ రూప,విద్యార్థులు పాల్గొన్నారు.



# రోబోటిక్స్ వైపు విద్యార్థుల అడుగులు

**సిరికొండ ఆదర్శ పాఠశాలలో సోహం అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్‌షాప్.. 24 మందితో రోబోటిక్స్ క్లబ్**

సిరికొండ, సెప్టెంబర్ 19(జనం సాక్షి ): విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు సృజనాత్మక ఆలోచనలు, సమస్య పరిష్కార నైపుణ్యాలను వెలికితీసే లక్ష్యంతో సిరికొండ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో సోహం అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. శనివారం 8వ, 9వ తరగతులకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో మొత్తం 106 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు రోబోటిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రాక్టికల్ కార్యకలాపాల ద్వారా రోబోటిక్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే విధంగా శిక్షణ అందించారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్తులో రోబోటిక్స్‌కు ఉన్న అవకాశాలపై కూడా విద్యార్థులకు వివరించారు.వర్క్‌షాప్‌లో విద్యార్థుల ప్రతిభ, ఆసక్తిని పరిశీలించిన అనంతరం 24 మంది విద్యార్థులను రోబోటిక్స్ క్లబ్‌కు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. రోబోటిక్స్ క్లబ్‌కు 9వ తరగతికి చెందిన శ్రీ ఆదిత్య కెప్టెన్‌గా, 8వ తరగతికి చెందిన హర్ష వర్ధన్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు.కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ సౌమిత్రి, లావణ్య మేడం, సోహం అకాడమీ టీం హెడ్ వినయ్ రెడ్డి, సోహం అకాడమీ బృంద సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థులకు రోబోటిక్స్‌కు సంబంధించిన వివిధ అంశాలను వివరించి, ప్రాక్టికల్ కార్యకలాపాల ద్వారా శిక్షణ అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే అవగాహన కల్పించడం ద్వారా




భవిష్యత్తులో వారు సాంకేతిక రంగంలో తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించేలా ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించిన సోహం అకాడమీ యాజమాన్యానికి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



## యంగ్ స్టార్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం

**కథలాపూర్ సెప్టెంబర్ 19 (జనంసాక్షి)**

కథలాపూర్ మండల కేంద్రంలోని యంగ్ స్టార్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గణపతి నవరత్రి ఉత్సవాల సందర్భంగా 26వ వసంతాలను పురస్కరించుకొని మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఇట్టి మహానదన కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ రవికిరణ్, సర్పంచ్ న్యావనంది శేఖర్, ఉప సర్పంచ్ చేటు పల్లి ప్రసాద్, వార్డు సభ్యులు గ్రామ పెద్ద మనుషులు యూత్ సభ్యులు ప్రజలు పాల్గొనడం జరిగింది.

## కలెక్టర్ ఆదేశాల మేరకు బోర్ ఏర్పాటు..

**సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు..**



**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మండలంలోని బాబుల్గావ్ గ్రామస్థులు మిషన్ భగీరథ నీళ్లు రాక మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక అధికారులు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ స్పందించి ఆర్డబ్ల్యూఎస్ నిధుల నుంచి 7 లక్షల రూపాయలు ప్రత్యేక నిధులు కేటాయించి బోరు మోటారు వేయడానికి ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఎంపీడీవో అభినవ్ చందర్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాచప్పతో కలిసి గ్రామ శివారులో బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. తవ్విన బోరుబావిలో మంచినీళ్ళు పడ్డాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్యామప్ప పటేల్, సర్పంచ్ రవి కుమార్, తదితరులు ఉన్నారు.

## రౌడీ షీటర్ అరెస్టు హత్య యత్నం కేసులో రిమాండ్ కు తరలింపు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనంసాక్షి:** ఆర్మూర్ మండలనీలోని చేపూర్ గ్రామ శివారులో గల స్వాగత్ దాబా లో శనివారం ఉదయం 5 గంటల సమయములో గోవింద్ పేట్ గ్రామానికీ చెందిన బండమిది మహేష్ తో రౌడీ షీటర్ నీరడి రాజా బిల్లు కట్టే విషయములో గొడవ పెట్టుకొని, నీరడి రాజా ఇనుప రాడ్ తో బండమిది మహేష్ పై విచక్షణ రహితముగా దాడి చేసినట్లు ఆర్మూర్ టౌన్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బండమిది మహేష్ కి ముఖము పై తీవ్రగాయాలు అయినాయని మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్మూర్ ఎస్ఐ యాసీర్ అరాఫత్, కేసు నమోదు చేసి, దార్యాప్తు చేపట్టి, నిందితుడు నీరడి రాజాని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు నిజామాబాద్ కేంద్ర కారాగారానికి తరలించారు. నీరడి రాజా పై ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో 10 క్రిమినల్ కేసులు ఉన్నాయని, నిందితుడు నీరడి రాజా పై ఆర్మూర్ పోలీస్ స్టేషన్లో రౌడీ షీట్ కూడా తెర్చి వున్నది అని ఆర్మూర్ టౌన్ ఎస్ హె చ్ ఓ .పి. సత్యనారాయణ గౌడ్ తెలిపారు.చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదు అని ఎస్ హెచ్ ఓ ఆర్మూర్ టౌన్ తెలిపారు.

## డీజే కు అనుమతి లేదు.. రూ.60 వేల అడ్వాన్స్ తిరిగి ఇప్పించిన మాచారెడ్డి పోలీసులు




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి)**

గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే వినియోగానికి అనుమతి లేకపోవడంతో, డీజే ఏర్పాటు కోసం ముందుగా చెల్లించిన రూ.60 వేల అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇప్పించి మాచారెడ్డి పోలీసులు ప్రజల సమస్యకు పరిష్కారం చూపించారు.మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన ఆదర్శ యూత్ గణపతి మండల అధ్యక్షుడు గడ్డం శ్రీకాంత్ గారు గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే ఏర్పాటు చేసేందుకు సుమారు 15 రోజుల క్రితం ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన “లడ్డు నిర్వాహకుడికి రూ.60,000 అడ్వాన్స్‌గా చెల్లించారు. అయితే గణేష్ ఉత్సవాల సందర్భంగా డీజే వినియోగానికి అనుమతి లేకపోవడంతో, తాను చెల్లించిన అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని శ్రీకాంత్ మాచారెడ్డి పోలీసులను ఆశ్రయించారు.
విషయాన్ని తెలుసుకున్న మాచారెడ్డి ఎస్ఐ శ్రీ విజయ్ డీజే నిర్వాహకుడితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. శ్రీకాంత్ ముందుగా చెల్లించిన రూ.60,000 అడ్వాన్స్ మొత్తాన్ని పూర్తిగా తిరిగి ఇప్పించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిబంధనలను కఠినంగా అమలు చేస్తూనే, ప్రజలకు ఎదురయ్యే సమస్యలను మానవీయ దృక్పథంతో పరిష్కరించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు.

## గన్నేరువరం డబుల్ రోడ్డు కోసం అసెంబ్లీలో ఆమరణ దీక్షకైనా సిద్ధమే

**- దమ్మున్న లీడర్ కవ్వంపల్లి సత్యనారాయణ: అలువాల కోటి**



**గన్నేరువరం, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** గన్నేరువరం ప్రజల చిరకాల స్వప్నం అయిన డబుల్ రోడ్డు నిర్మాణం కోసం నిండు అసెంబ్లీలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టేందుకైనా తాను సిద్ధమని మానకొండూర్ నియోజకవర్గ దమ్మున్న లీడర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అలువాల కోటి మాట్లాడుతూ అన్నారు.ఈ సందర్భంగా అలువాల కోటి మాట్లాడుతూ.. “గన్నేరువరం డబుల్ రోడ్డు విషయంలో గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కానీ మా నాయకుడు కవ్వంపల్లి సత్యనారాయణ మాత్రం ప్రజల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం. ఇది మాటల లీడర్ కాదు.. చేతల లీడర్. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రోడ్డును వెంటనే డబుల్ రోడ్డుగా మార్చాల్సిందే. లేకుంటే అసెంబ్లీ వేదికగా కేసీఆర్ సర్కార్ హయాంలో జరిగిన నిర్లక్ష్యాన్ని ఎండగడతాం. అసెంబ్లీలోనే ఆమరణ దీక్షకు కూర్చుంటాం” అని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా మాట్లాడే నాయకుడు, నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడే ఏకైక నాయకుడు కవ్వంపల్లి సత్యనారాయణ అని, ఆయన వెంట గన్నేరువరం ప్రజలంతా ఉన్నారని అలువాల కోటి స్పష్టం చేశారు.


## సర్వీస్ రోడ్డుపై వస్తువులు, పశువులతో అడ్డంకులు సృష్టించొద్దు

**చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించిన ఎస్సై శివకుమార్**



నిజాంసాగర్, సెప్టెంబర్ 19: మహమ్మద్‌నగర్ మండల పరిధిలోని నడిమితండా, గిర్నీతండాకు చెందిన ప్రజలు సర్వీస్ రోడ్డుపై వస్తువులు ఉంచడం, పశువులను కట్టివేయడం ద్వారా రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దని మహమ్మద్‌నగర్ ఎస్ఐ శివకుమార్ సూచించారు.శనివారం ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సర్వీస్ రోడ్డును వాహనాలు, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వినియోగించుకోవాలని తెలిపారు. రోడ్డుపై వస్తువులు, పశువులను కట్టివేసి రాకపోకలకు అంతరాయం కలిగిస్తే ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్ఐ శివకుమార్ కోరారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్డును అడ్డగించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఉచిత వేతనం.. బెదిరింపుల పర్వం అధికారులను బెంబేలెత్తిస్తున్న అటెండర్ బి. గంగారం లీలలు






**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 19 జనంసాక్షి:** జిల్లా గ్రంథాలయ సంస్థ నిజామాబాద్ ప్రభుత్వ కార్యాలయంలో విధులు నిర్వర్తించాల్సిన బురిగేడి. గంగారం అనే అటెండర్ పై స్థాయి అధికారులకే చుక్కలు చూపిస్తున్న వైనం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఏకధాటిగా సెలవులు మీద సెలవులు పెడుతూ... విచారించాల్సిన, వేతనం ఇవ్వాల్సిన అధికారులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పేరుతో బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.నిబంధనల ప్రకారం ఆఫీసులో ఉండాల్సిన సదరు వ్యక్తి ,ఆఫీసర్లు వాడే కార్లలో షికార్లు చేస్తూ అధికారులను శాసిస్తున్నాడని సమాచారం.విధి నిర్వహణలో నిలదీయాల్సిన ఉన్నతాధికారులు సైతం ఆయన బెదిరింపులకు భయపడి మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ, అధికారులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఈ అటెండర్ పై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి, సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధ్యులు, స్థానికులు, పాఠకులు, కోరుతున్నారు.

### లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన ఆధ్వర్యంలో

# ఘనంగా జాతీయ నాట్య దినోత్సవం

**ప్రముఖ నాట్య కళాకారుడు 'కళా తపస్వి' జె.రతన్ కుమార్ దంపతులు/శిష్యురాళ్లకు సత్కారం**



కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 19 ( జనంసాక్షి ) : లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన ఆధ్వర్యంలో జాతీయ నాట్య దినోత్సవాన్ని (ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెల 3వ శనివారం) పురస్కరించుకొని నగరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నాట్య కళాకారులు, 'కళా తపస్వి' జె. రతన్ కుమార్ హాజరయ్యారు. భారతీయ సాంప్రదాయ నాట్య రంగానికి, కళల పరిరక్షణకు రతన్ కుమార్ అందిస్తున్న విశేష సేవలను లయన్స్ క్లబ్ సభ్యులు కొనియాడారు. అనంతరం 'కళా తపస్వి' జె.రతన్ కుమార్ ని, అలాగే వారి ప్రతిభావంతులైన శిష్యురాళ్లు వైష్ణవి, వినూత్న లని లయన్స్ క్లబ్ ప్రతినిధులు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.?ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను, నాట్య కళను భావితరాలకు అందిస్తూ కళామ్మతల్లికి సేవ చేస్తున్న కళాకారులను గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సత్కార కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన సీనియర్ లయన్ సభ్యులు లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, లయన్ పచ్చునూరి సురేందర్, లయన్ మర్రిపెల్లి మహేందర్, లయన్ నార్ల వేణుగోపాల్, లయన్ కోట సత్యం, లయన్ మనోహరా చారి, లయన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



కమాన్‌పూర్, సెప్టెంబర్ 19, (జనంసాక్షి): సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి దశలవారీగా ఇళ్లను మంజూరు చేస్తూ, నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. దీంతో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో మొత్తం 86 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఇందులో తొలి విడతగా 53 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందించగా, పలువురు ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలను చేపట్టి తుది దశకు తీసుకొచ్చారు. తాజాగా శనివారం మరో 21 మంది అర్హులైన లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్, కమాన్ పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ మాట్లాడుతూ.. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు కూడా త్వరగా ప్రొసీడింగ్ కాపీలు అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### కమాన్ పూర్ మండల వార్డు సభ్యుల ఫోరం ఇంచార్జిగా సొప్పరి సంతోష్ కుమార్



కమాన్ పూర్, సెప్టెంబర్ 19, (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల వార్డు సభ్యుల ఫోరం మండల ఇంచార్జిగా జూలపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు సొప్పరి సంతోష్ కుమార్ ను వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు నియమించినట్లు పెద్దపల్లి జిల్లా వార్డు సభ్యుల ఫోరం ఇంచార్జి తప్పట్ల మోహన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సొప్పరి సంతోష్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని వార్డుల్లో నెలకున్న సమస్యలు – వాటి పరిష్కారం దిశగా ముందు ఉండేది వార్డు సభ్యులు మాత్రమే అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వార్డుల్లో సమస్యలు పరిష్కారం అయితేనే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. వార్డుల స్థాయి నుండే గ్రామం.. మండలం.. జిల్లా.. రాష్ట్రం.. దేశం.. ఇలా ప్రగతి పథంలో ముందుకు సాగుతేనే.. దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. పల్లెల ప్రగతిలో వార్డు సభ్యుల పాత్ర క్రియాశీలకమన్నారు. తన పై ఎంతో నమ్మకంతో కమాన్ పూర్ మండల వార్డు సభ్యుల ఫోరం ఇంచార్జిగా అపోగించిన బాధ్యతలకు న్యాయం చేసే విధంగా.. వార్డు సభ్యులకు గౌరవమైన హోదా.. హక్కుల సాధన కోసం కృషి చేస్తానని వెల్లడించారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## గుర్తింపు సంఘం ఎన్నికల వరకు జాతీయ కార్మిక సంఘాలకు సమాన హోదా ఇవ్వాలి

**డైరెక్టర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్)కు బీఎంఎస్ ప్రతినిధి బృందం వినతి**



యైటింక్లైన్ కాలనీ, (జనంసాక్షి)సెప్టెంబర్ 19: సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో, కొత్త ఎన్నికలు జరిగే వరకు అన్ని జాతీయ కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించి, కార్మికులకు సంబంధించిన చర్చలు, కమిటీలు, నిర్ణయ ప్రక్రియల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ప్రతినిధి బృందం కోరింది.ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో డైరెక్టర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) గౌతమ్ పోట్రు, ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీఎంఎస్ ప్రతినిధులు పలు కీలక అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగే వరకు అన్ని జాతీయ కార్మిక సంఘాలకు సమాన అవకాశాలు కల్పించాలని, కార్మికులకు సంబంధించిన కమిటీలు, చర్చలు, నిర్ణయ ప్రక్రియల్లో అన్ని సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.అలాగే 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్మికుల 40 శాతం ప్రాఫిట్ షేర్‌ను తక్షణమే ప్రకటించి చెల్లించాలని బీఎంఎస్ డిమాండ్ చేసింది. సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న కార్మిక, సంక్షేమ సమస్యలు, పదోన్నతులు, బదిలీలు, సిబ్బంది కొరత, ఇతర పరిపాలనా సమస్యలను కూడా అత్యవసరంగా పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరింది.ప్రతినిధులు వివరించిన సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ గౌతమ్ పోట్రు హామీ ఇచ్చినట్లు బీఎంఎస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి, కేంద్ర కోశాధికారి సాయవేన సతీష్, నాయకులు వంశీ, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### తిరుమల కొండపై అనంతారం చిన్నారి కళా ప్రదర్శన సాంప్రదాయ నృత్యంతో భక్తులను ఆకట్టుకున్న మూల ఆరాధ్య



ఇల్లంతకుంట, సెప్టెంబర్ 19 (జనంసాక్షి): ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన చిన్నారి మూల ఆరాధ్య తిరుమల కొండపై నిర్వహించిన నృత్య కళా ప్రదర్శనలో తన ప్రతిభను చాటుకుని చూపరులను ఆకట్టుకుంది.తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామివారు సింహ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతున్న సందర్భంగా తిరుపతి సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లాకు చెందిన హిమగిరి అకాడమీ తరఫున 23 మంది చిన్నారులు పాల్గొని సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో భక్తులను అలరించారు.ఈ కార్యక్రమంలో అనంతారం గ్రామానికి చెందిన మూల ఆరాధ్య కూడా నృత్య ప్రదర్శన ఇచ్చి తన ప్రతిభను చాటుకుంది. తిరుమల కొండపై తమ కుమార్తె నృత్య ప్రదర్శన ఇవ్వడం పట్ల ఆరాధ్య తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.తమ గ్రామానికి చెందిన చిన్నారి నృత్య కళలో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. చిన్న వయసులోనే కళారంగంలో ప్రతిభ చూపుతున్న ఆరాధ్యకు మరిన్ని అవకాశాలు లభించి, భవిష్యత్తులో గొప్ప కళాకారిణిగా ఎదగాలని వారు అభినందనలు తెలిపారు.నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు టీటీడీ తరఫున స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

### రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు

## మానేరు విద్యార్థి ఎంపిక




కరీంనగర్ కల్చరల్,సెప్టెంబర్ 19(జనం సాక్షి): నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న 4వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి అక్షిత్ ఎంపికయ్యాడు. ఇటీవల అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అక్షిత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అక్షిత్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపల్ సరితారెడ్డితో పాటు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొని అక్షిత్‌ను అభినందించారు.

### కొండాపూర్ పారిశుధ్య కార్మికుడు కుట్ల వెంకటయ్యకు ఘన సన్మానం..



చిగురుమామిడి సెప్టెంబర్ 19(జనంసాక్షి): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న పారిశుధ్య కార్మికుడు శ్రీ కుట్ల వెంకటయ్యను శనివారం కొండాపూర్ గ్రామ పంచాయతీ సాధారణ పాలకవర్గ సమావేశం సందర్భంగా ఘనంగా సన్మానించారు.గ్రామ పంచాయతీ పరిధిలోని ముఖ్యంగా 4,5,6వార్డుల్లో మురికి కాలువల శుభ్రత, రోడ్ల పక్కన పెరిగిన పిచ్చిగడ్డి తొలగింపు, పారిశుధ్య నిర్వహణతో పాటు ఏ పని అప్పగించినా ఆయన వెంటనే స్పందిస్తారని స్థానికులు కొనియాడారు.పనిని పూర్తి స్థాయిలో శుభ్రంగా, క్రమబద్ధంగా పూర్తి చేయడంలో వెంకటయ్య చూపుతున్న చొరవ బాధ్యతాయుతమైన సేవలను గుర్తిస్తూ ఈ సన్మానం చేసినట్లు సర్పంచ్ మార్క రాజ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పనిభారం,వివిధ ఇబ్బందులు ఉన్నప్పటికీ ఓపికతో,నిబద్ధతతో, సేవాభావంతో విధులు నిర్వహిస్తూ గ్రామ పారిశుధ్య పరిరక్షణకు వెంకటయ్య అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఆయనకు గ్రామ పంచాయతీ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టును అసభ్య పదజాలంతో దూషించిన మాజీ ఎంపీపీని సస్పెండ్ చేయాలి

◆టీయూడబ్ల్యూజే హెచ్-143 జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్

◆తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన, వినతిపత్రం అందజేత



మల్లాపూర్, సెప్టెంబర్ 19:(జనంసాక్షి)

మల్లాపూర్ మండల సీనియర్ జర్నలిస్ట్ రుద్ర రాంప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించిన అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నల్ల రాజన్నను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని టీయూడబ్ల్యూజే హెచ్-143 జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్ అన్నారు. శనివారం యూనియన్ల అతీతంగా జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలను ధరించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులపై అధికార పార్టీ అహంకారంతో ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని, చేసిన వ్యాఖ్యలకు వెంటనే జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు నేతను వెంటనే సస్పెండ్ చేయాలని లేని పక్షంలో జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉద్యమంను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్యకు ఫోన్లో మాట్లాడి జరిగిన సంఘటనపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాంచందర్ కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు అంజుగౌడ్, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు అలాల శంకర్, షౌకత్ అలీ, జిల్లా ఉపాధ్యక్షుడు కసుక సంజీవ్, ఐజేయూ ఈసీ సభ్యుడు చింతలూరి రంజిత్, జర్నలిస్టులు సుతారి కృష్ణమాచారి, తోకల పవన్, ముత్యాల రమేష్, మోర సతీష్, నూనె అంజనేయులు, పెంబి మహేష్, ఆదరి రాజేందర్, రమేష్ నాయక్, శేఖర్, శ్రీనివాస్, మల్లేష్, వెంకటేష్, సుధాకర్, మహేష్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు




## ప్లాస్టిక్ ను నివారించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**ఎం.సీ.ఎస్ చైర్మన్ జిందం కళాచక్రపాణి**

సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 19 (జనంసాక్షి)

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడవద్దని, ప్లాస్టిక్ వల్ల ఆరోగ్యాలు పాడవుతాయని, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత- ఈ సేవ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ ను నివారించి పర్యావరణాన్ని కాపాడాలని, ప్లాస్టిక్ కలుషితమై ఆరోగ్యాలు దెబ్బతింటాయని, ఎవరు కూడా ప్లాస్టిక్ కు సంబంధించిన వస్తువుల్ని ఎక్కువగా వాడవద్దని పలు సూచనలు ఇచ్చారు. వినాయక నిమజ్జన సమయంలో ప్లాస్టిక్ కు సంబంధించిన వస్తువులను నీటిలో పడవేయకుండా అక్కడే ఏర్పాటు చేసిన బిన్స్ లో వేయాలని కోరారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛత కార్యక్రమములో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ , ఎం డి ఖదీర్ పాష, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దార్ల సందీప్, కౌన్సిల్ సభ్యులు ఆడెపు చంద్రకళ, ఎర్రం వెంకటరాజం, ఎలుక వెంకన్న, నంది శంకర్, లింగంపల్లి భాగ్యలక్ష్మి, మామిడాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ లో “మై భారత్” కేంద్రం ఏర్పాటు

**హర్షం వ్యక్తం చేసిన సామాజిక సేవా కార్యకర్త వేముల మార్కండేయులు**

సిరిసిల్ల టౌన్ 1 సెప్టెంబర్ 19 (జనంసాక్షి)



నెహ్రూ యువ కేంద్రం స్థానంలో”మై భారత్” కేంద్రాన్ని సిరిసిల్లలోని జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసినట్లు సామాజిక సేవా కార్యకర్త వేముల మార్కండేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “మై భారత్” కేంద్రాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని, నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉండేదని, ఇప్పుడు ప్రస్తుతం అన్ని జిల్లాలకు మైభారత్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కోసం, అలాగే యువత ప్రభుత్వాలు చేస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యమై మంచి శిక్షణ తర్ఫీదు పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వాలు, ప్రజా సంక్షేమ పథకాలు వివరంగా తెలుసుకోవచ్చన్నారు. యువతకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు ఈ డిపార్ట్మెంట్ ద్వారా చక్కని సేవలు అందించవచ్చన్నారు. దూరదృష్టితో స్థాపించిన కేంద్ర ప్రభుత్వం దేశంలో ఒకేసారి 623 కేంద్రాలను అప్పటి ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్రాలను స్థాపించి, ఎంతో మంది యువకులను రోల్ మోడల్ గా అందించిందని గుర్తు చేశారు. యువతకు శిక్షణను ఇచ్చి, ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి పనులను మండల, గ్రామాల వారిగా ప్రజలకు చేరవేసేందుకు ఈ “మై భారత్ కేంద్రం” ఉపయోగపడుతుందని, యువతకు ఒక మంచి అవకాశం అని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## ఐకెపి గోడౌన్ నిర్మాణానికి భూమి పూజ చేసిన మానాల మోహన్ రెడ్డి

రుద్రంగి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి)

రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామంలో నూతనంగా మంజూరైన రూ. 30 లక్షల విలువైన ఐకేపీ గోడౌన్ నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి భూమి పూజ చేసి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు, మహిళా సంఘాలకు గోడౌన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏఈఓ లక్ష్మణ్, ఉప సర్పంచ్ దాసరి అశోక్, తూమ్ జలపతి, జక్కు మోహన్, కొండ రాజేందర్, జక్కు వంశీ, జూల దిలీప్, కొమ్ముల రవీందర్, లక్కాకుల శ్రీనివాస్, జక్కు లింగారెడ్డి, రాజు నాయక్, జక్కుల లక్ష్మీ నరసయ్య, పందుగ గంగాధర్, తిక్క భూమయ్య, ఇంద్ల లక్ష్మయ్య, క్యాతం పెద్ద గంగాధర్, లకావత్ బాలు, చెదలు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓను కలిసిన ఎస్జీటీయూ నూతన కార్యవర్గం

రాయికల్ సెప్టెంబర్ జనం సాక్షి:

రాయికల్ మండల ఎస్జీటీయూ ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు శనివారం మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్జీటీయూ రాయికల్ మండల అధ్యక్షుడు దొంగ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్జీటీయూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యా రంగ అభివృద్ధికి సంఘం తరపున కృషి చేస్తామని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు కార్యక్రమంలో ఎస్జీటీయూ మండల ప్రధాన కార్యదర్శి జి.రాజేశం,నూతన కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, రాజారెడ్డి,రాజేందర్,రాము,రమేష్ తదితరులు పాల్గొన్నారు.






## శిక్షణార్థులకు డిజిటల్, ఆర్థిక అక్షరాస్యత

రాయికల్ సెప్టెంబర్ జనం సాక్షి :

రాయికల్ పట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ పొందుతున్న యువతకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిజిటల్,ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సురక్షితంగా వినియోగించుకోవాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరేష్ మాట్లాడుతూ పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై బీమా పథకాలతో పాటు స్వయం ఉపాధి రుణాలపై వివరించారు. కార్యక్రమంలో జీఎంఆర్ ప్రతినిధులు సాయి శ్రీనివాస్,మహేష్,జీయర్ స్వామి ట్రస్ట్ ఇన్చార్జి ఏ.ఎం రాజు రెడ్డి, ఆర్గనైజర్ రఘుపతి, సిబ్బంది ప్రమోద్, నాగేందర్, చిరంజీవి, కృష్ణవేణి,వనిత పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి, సెప్టెంబర్ 19 (జనం సాక్షి)

రుద్రంగి మండలం మానాల గ్రామంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సుమారు 2 లక్షల 16 వేల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ చెక్కులను మంజూరు చేయించిన మానాల మోహన్ రెడ్డి,వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు లబ్ధిదారులు ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏఈవో లక్ష్మణ్ నాయక్, ఉప సర్పంచ్ దాసరి అశోక్, తూమ్ జలపతి, జక్కు మోహన్, కొండ రాజేందర్, జక్కు వంశీ, జూల దిలీప్, కొమ్ముల రవీందర్, లక్కాకుల శ్రీనివాస్, జక్కు లింగారెడ్డి, జక్కుల లక్ష్మీనరసయ్య, పందుగ గంగాధర్, తిక్క భూమయ్య, ఇంద్ల లక్ష్మయ్య, క్యాతం పెద్ద గంగాధర్, లకావత్ బాలు, చెదలు నవీన్, ఉమ్మడి మానాల సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ పేరెంట్‌కు సన్మానం

**ఎంపీపీఎస్ మొగిలిపేటలో తల్లిదండ్రుల సమావేశం**

మల్లాపూర్ సెప్టెంబర్19 (జనంసాక్షి)



ఎంపీపీఎస్ మొగిలిపేట పాఠశాలలో శనివారం రోజు తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని తల్లిదండ్రుల సమక్షంలో ప్రదర్శించారు. విద్యార్థులను రోజూ పాఠశాలకు పంపించడం, నీట్‌గా తయారుచేసి పంపించడం, పాఠశాల యూనిఫాం ధరించేలా చూడడం, హోంవర్క్ చేయించడం, క్రమశిక్షణతో ఉండేలా ప్రోత్సహించడం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపిన తల్లిదండ్రుల్లో ఒకరిని ఈ నెల “ఉత్తమ పేరెంట్”గా ఎంపిక చేసి సన్మానించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభివృద్ధిలో పాఠశాలతో కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంసి చైర్మన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.